**విలేకరులు కావలెను**

**పెన్ సత్తా తెలుగు దినపత్రిక**

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాప్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily





సంపుటి : 4 సంచిక :155 ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ గురువారం 22 అక్టోబర్ 2026 పేజీలు : 08 వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool


## 'రప్పా రప్పా' అంటూ రౌడీయిజం చేస్తే

# సహించం

### శాంతిభద్రతల్లో ఏపీ ఆదర్శంగా నిలవాలి





- పోలీసు అమరవీరుల సంస్మరణ దినంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు
- శాంతిభద్రతల పరిరక్షణలో ఏపీ దేశానికే ఆదర్శం కావాలని పిలుపు
- రాజకీయ ముసుగులో నేరాలు, రౌడీయిజంపై ఉక్కుపాదం మోపాలని ఆదేశం
- భద్రత ఉంటేనే పెట్టుబడులు వస్తాయి, అభివృద్ధి సాధ్యమని స్పష్టీకరణ
- సైబర్ నేరాలపై అప్రమత్తత, టెక్నాలజీ వినియోగం పెంచాలని పోలీసులకు సూచన
- అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ

**అమరావతి**

ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖ శాంతిభద్రతల పరిరక్షణలో దేశానికే ఆదర్శంగా నిలవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. రాజకీయ ముసుగులో అరాచకాలు, రౌడీయిజం చేసేవారిని ఉక్కుపాదంతో అణచివేయాలని పోలీసులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. నేరస్తులకు పోలీసు యూనిఫాం చూస్తే భయం కలగాలని, అదే సమయంలో బాధితులకు పూర్తి భరోసా లభించాలని ఆయన ఆకాంక్షించారు. మంగళగిరిలోని 6వ ఏపీఎస్పీ బెటాలియన్‌లో నేడు నిర్వహించిన 'పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అంతకుముందు, విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన అమర పోలీసులకు ఆయన ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "ఖాకీ అంటే బాధ్యత, పోలీసు అంటే భరోసా. ప్రమాదం జరిగినా, నేరం జరిగినా ప్రజలకు మొదటగా గుర్తొచ్చేది పోలీసులే. ప్రజలు పండుగలు ప్రశాంతంగా జరుపుకోవడానికి పోలీసులు తమ కుటుంబ - వివరాలు 2లో..

## ఏపీలో 19 మున్సిపాలిటీల ఎన్నికల ప్రక్రియకు బ్రేక్

- నామినేషన్ల దాఖలును అడ్డుకున్నారంటూ వైసీపీ పిటిషన్
- అభ్యర్థుల తుది జాబితా ప్రచురణను నిలిపివేయాలని సుప్రీం ఉత్తర్వులు
- సుప్రీంకోర్టు సూచనలతో ఎస్ఈసీ కీలక నిర్ణయం



**అమరావతి**

ఆంధ్రప్రదేశ్‌లో 19 మున్సిపాలిటీలలో ఎన్నికల ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సంఘం తాత్కాలికంగా నిలిపివేసింది. సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు కాసేపటి క్రితం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఈ మున్సిపాలిటీల్లో నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ, అభ్యర్థుల తుది జాబితా ప్రచురణ నిలిచిపోయాయి. రాష్ట్రంలో అధికార పక్షం వేధింపుల కారణంగా పలు ప్రాంతాల్లో తమ అభ్యర్థులు నామినేషన్లు వేయలేకపోయారని, వారిని అడ్డుకున్నారని ఆరోపిస్తూ వైసీపీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. నామినేషన్ల వివరాలు 2లో..



## డ్రగ్స్‌తో భావితరాలకు ముప్పు

- 2029 డిసెంబర్ 31 నాటికి భారత్‌ను డ్రగ్స్ రహిత దేశంగా మార్చమే మా లక్ష్యం
- ఢిల్లీలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో కేంద్ర హోంమంత్రి
- రానున్న మూడేళ్ల పాటు ఉమ్మడిగా పోరాడి మాదకద్రవ్యాల మహమ్మారిని దేశం నుంచి తరిమికొట్టాలని ఆయన పిలుపు

## రెబల్స్ బరిలో ఉంటే సస్పెన్షన్ వేటు తప్పదు

- సీఎం చంద్రబాబు వార్నింగ్
- తెలుగుదేశం పార్టీ ముఖ్య నేతలతో సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్
- స్థానిక ఎన్నికల్లో రెబల్స్ బరిలో ఉంటే పార్టీ నుంచి సస్పెన్షన్ వేటు తప్పదని సీఎం హెచ్చరించారు.
- జనసేన, బీజేపీ నేతలతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ ఎన్నికల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలి
- క్షేత్రస్థాయిలో సీట్ల సర్దుబాటు సాఫీగా జరిగేలా చూడాలి
- మిత్రపక్షాల అధికారిక అభ్యర్థులు పోటీ చేస్తున్న చోట్ల కూడా రెబల్స్ లేకుండా చర్యలు తీసుకోవాలి



**అమరావతి**

పట్టణ స్థానిక సంస్థల నామినేషన్లపై సుప్రీంకోర్టు తీర్పును వైఎస్సార్సీపీ వక్రీకరిస్తోందని చంద్రబాబు విమర్శించారు. రాజకీయం కోసం తప్పు దోవ పట్టిస్తోందని ఆరోపించారు. జగన్ లాంటి క్రిమినల్ లిటిగెంట్ల వల్ల అభివృద్ధి, సంక్షేమానికి ఆటంకాలు ఎదురవుతున్నాయని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తాము అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేస్తుంటే, జగన్ మాత్రం ఏ ప్రాంతంలో రౌడీలను దించాలనే విధ్వంసరచన చేస్తున్నారన్నారు. స్థానిక పోరుకు ప్రచారాన్ని ఉధృతం వివరాలు 2లో..

## వచ్చే వారం కృష్ణా, గోదావరి యాజమాన్య బోర్డుల సమావేశం

- ఈనెల 26న కేఆర్ఎంబీ సమావేశం
- ఆ అంశాలపై చర్చ జరిగే అవకాశం
- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాల మధ్య జలవివాదాలకు సంబంధించి వచ్చే వారంలో కృష్ణా, గోదావరి నదీ యాజమాన్య బోర్డులు సమావేశం కానున్నాయి.




**హైదరాబాద్**

తెలుగు రాష్ట్రాల నీటి అంశాలకు సంబంధించి వచ్చే వారం రెండు కీలక సమావేశాలు జరగనున్నాయి. కృష్ణా, గోదావరి నదీ యాజమాన్య బోర్డుల భేటీల్లో పలు కీలక అంశాలు చర్చకు రానున్నాయి. కృష్ణా జలాల్లో రెండు రాష్ట్రాల వాటాకు సంబంధించి ప్రధానంగా చర్చ జరగనుంది. ప్రాజెక్టుల అనుమతులకు సంబంధించిన పరస్పర ఫిర్యాదులు, పోలవరం, టెలీమెట్రీ పరికరాల ఏర్పాటు సహా ఇతర అంశాలు వివరాలు 2లో..




## ఆందోళనలు హింసకు దారితీస్తాయి

- సీజేపీ నేతల కేసు విచారణలో ఫ్రాన్స్ అల్లర్లను ప్రస్తావించిన హైకోర్టు
- ఢిల్లీ హైకోర్టులో సౌరవ్ దాస్, ఆశుతోష్ రాంకాకు ఊరట లభించలేదు
- ప్రత్యామ్నాయ న్యాయ మార్గాన్ని ఆశ్రయించాలని హైకోర్టు సూచించింది.

## ఢిల్లీలో మళ్లీ వాయు కాలుష్యం



- అమల్లోకి వచ్చిన గ్రాఫ్ స్టేజ్1 ఆంక్షలు
- కాలుష్య నియంత్రణ చర్యలను ముమ్మరం చేయాలని అధికారులకు సూచించారు
- ఢిల్లీ-ఎన్‌సీఆర్ అంతటా గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (జీఆర్‌ఏపీ) తొలి దశ అమలు చేశారు.

# రెబల్స్ బరిలో ఉంటే సస్పెన్షన్ వేటు తప్పదు

-మొదటిపేజీ తరువాయి

చేయాలన్న చంద్రబాబు, రెబల్స్‌గా నిలిచిన వాళ్లపై సస్పెన్షన్ తప్పదని హెచ్చరించారు. స్థానిక ఎన్నికల్లో కూటమి విజయానికి అనుసరించాల్సిన వ్యూహంపై చంద్రబాబు పార్టీ ముఖ్యనేతలతో దశల వారీగా టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. జనసేన, బీజేపీ నేతలతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ ఎన్నికల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సీట్ల సర్దుబాటు సాఫీగా జరిగేలా చూడాలని, మిత్రపక్షాల అధికారిక అభ్యర్థులు పోటీ చేస్తున్న చోట్ల కూడా రెబల్స్ లేకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కూటమి పార్టీల మధ్య సమన్వయం లోపించకుండా ప్రతి దశలోనూ అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు.

నామినేటెడ్ పదవుల్లో అవకాశం: టికెట్లు ఆశించి దక్కించుకోలేకపోయిన వారికి నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా రెబల్స్‌గా నామినేషన్లు వేసిన వారు ఉపసంహరించుకోకుంటే సస్పెన్షన్ తప్పదని హెచ్చరించారు.

సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని, ఇప్పటివరకు అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. 'చెప్పాం.. చేస్తున్నాం ' అనే నినాదంతో ప్రజల్లోకి వెళ్లాలని నేతలకు స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం చేసిన మంచిని వివరించడంతో పాటు వైఎస్సార్సీపీ అరాచకాలను ప్రజలకు తెలియజేయాలని, ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకం కావాలని అన్నారు.

కోర్టు తీర్పులను సైతం వక్రీకరిస్తూ: రాజకీయాల్లో జగన్ లాంటి క్రిమినల్ లిటిగెంట్లు ఉంటే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు అడ్డంకులు ఏర్పడతాయని చంద్రబాబు విమర్శించారు. తానే విధ్వంసానికి దిగుతూ, తిరిగి కోర్టులను ఆశ్రయించడం జగన్ లాంటి వారికే చెల్లుతుందని వ్యాఖ్యానించారు. కోర్టు తీర్పులను సైతం వైఎస్సార్సీపీ వక్రీకరిస్తూ రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని ఆరోపించారు. ప్రజాస్వామ్యంపై నమ్మకం లేని, వికృత మనస్తత్వం కలిగిన వ్యక్తులతో రాజకీయం చేయాల్సి వస్తోందని విమర్శించారు. ఇలాంటి వారిని రాజకీయాలకు దూరంగా ఉంచాలని అన్నారు.

స్థానిక ఎన్నికల్లో కూటమి నేతలు అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేస్తుంటే వైఎస్సార్సీపీ అధినేత బెంగళూరులో కూర్చొని విధ్వంసాలకు కుట్రలు చేస్తున్నారని చంద్రబాబు ఆరోపించారు. ఏ మున్సిపాలిటీలో ఎవరిని బరిలోకి దించాలనే దానిపై కూటమి నేతలు చర్చిస్తుంటే, ఏ ప్రాంతానికి, ఏ రాష్ట్రం నుంచి గుండాలను తీసుకురావాలనే ఆలోచనలో జగన్ ఉన్నారని విమర్శించారు. విధ్వంసాలకు పాల్పడి, వాటిని అడ్డుకునే ప్రయత్నం జరిగితే కోర్టులను ఆశ్రయించి ఎన్నికలను నిలిపివేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి రాజకీయాలకు ప్రజలు దూరంగా ఉండాలని అన్నారు. ఎన్నికల ప్రచారానికి వారం రోజులే గడువు ఉండటంతో మిగిలిన సమయాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని చంద్రబాబు నేతలకు సూచించారు. అన్ని మున్సిపాలిటీల్లో విస్తృత ప్రచారం చేపట్టాలని, అభ్యర్థుల గెలుపు కోసం సమష్టిగా పనిచేయాలని అన్నారు.

# జగన్ వేసిన ట్రాప్‌లో చంద్రబాబు చిక్కుకున్నారా




**పులివెందుల :** స్థానిక సంస్థల ఎన్నికల్లో జరుగుతున్న ఘటనలు చూస్తుంటే టీడీపీ, వైసీపీలు రెండూ ఒకే బాట పయనిస్తున్నాయి. అరాచకాలలో ఒకరిని మించి మరొకరు అన్నట్లు వ్యవహరిస్తున్నారు. గతంలో వైఎస్ జగన్ పాలనపై విమర్శలు చేసే చంద్రబాబు నేడు జరుగుతున్న పరిస్థితులను అవతలి వారిపైకి నెట్టడం సమర్థనీయం కాదు. ఎన్నికలంటే శాంతిభద్రతల సమస్య తలెత్తకూడదు. ఇప్పుడు జరుగుతున్న, జరిగిన పరిణామాలకు కూటమి ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుంది. అలాగే రాష్ట్ర ఎన్నికల కమిషన్ కూడా చేష్టలుడిగి చూస్తున్నట్లు కనిపిస్తుంది. ఇంత ఉదాసీన వైఖరి కారణంగా ఆంధ్రప్రదేశ్ లో ఇక ఏ ప్రభుత్వం వచ్చినా ఇవే పరిస్థితులు తలెత్తక మానవన్న కామెంట్స్ రాజకీయ విశ్లేషకులు కూడా చేస్తున్నారు.రాజకీయాలు చూడండి. అయితే ఇప్పుడు ఏపీలో మాత్రం అధికార పార్టీది, విపక్ష పార్టీది ఒకే దారి అన్నట్లు వ్యవహరిస్తున్నాయి. ఇప్పుడు వైసీపీ బాధిత పార్టీగా కనిపించవచ్చు. కానీ అదే తమ పాలనలో జగన్ ప్రభుత్వం అవలంబించిన చర్యలేవిటి? అని చంద్రబాబు ప్రశ్న కూడా అందరూ ఆలోచించాల్సిన విషయమే. అలాగే ఇదే విమర్శ రేపు చంద్రబాబు కూడా ఎదుర్కొనే పరిస్థితులు రావచ్చు. నాడు కుప్పం నియోజకవర్గంలో జగన్ చేసిన పని, నేడు పులివెందులలో టీడీపీ చేసింది. ఇందులో తప్పు వెతుక్కోవడానికి ఇద్దరిలోనూ వెతికినా కనిపించవు. కానీ జనం మాత్రం వీటిని గమనిస్తూనే ఉంటారన్న విషయాన్ని మాత్రం వైసీపీ, టీడీపీలు మర్చి పోకూడదు. ప్రజాస్వామ్యం మనుగడ కొనసాగించాలంటే రెండు పార్టీల అధినేతలు ఎవరికి వారే ఆత్మవిమర్శలు చేసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. స్థానిక సంస్థల ఎన్నికలను టీడీపీ, వైసీపీ లు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. అధికారంలో ఉన్న కూటమి పార్టీకి అత్యధిక స్థానాల్లో గెలుపు సాధించుకోవాలని సహజంగానే భావిస్తుంది. అదే సమయంలో వైసీపీ స్థానిక సంస్థల ఎన్నికల్లో కొంత బలోపేతం అయితే రానున్న సాధారణ ఎన్నికలకు పుంజుకుంటామని భావన కారణంగానే ఈ రకమైన పరిస్థితులు ఏర్పడ్డాయన్నది కాదనలేని వాస్తవం. స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి. అందులో తప్పులేదు. కానీ హింసా రాజకీయాలకు స్వస్తి పలకాలి. అనుభవమున్నచంద్రబాబు కు ఇది ఎంత మాత్రం అభిలషణీయం కాదు. ఒకరకంగా జగన్ వేసిన ట్రాప్ లో చంద్రబాబు చిక్కుకున్నారా? అన్న అనుమానం కూడా చాలా మంది సీనియర్ నేతల్లో వ్యక్తమవుతుంది. మొత్తం మీద ఆంధ్రప్రదేశ్ లో స్థానిక సంస్థల ఎన్నికల్లో మున్సిపల్ నామినేషన్ల సందర్భంగానే చూశాం. ఇక జడ్పీటీసీ, పంచాయతీ ఎన్నికల్లో ఇంకెంత రగడ చూడాలో.. .దేవుడా ఏపీకి నీవే దిక్కు. అని అనుకోవడం తప్ప చేసేదేమీ లేదు

వ్యూహాలు ప్రతివ్యూహాలతో

ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికలలో వైసీపీ అధినేత వైఎస్ జగన్ పాచికలు పారినట్లు కనపడుతుందివైఎస్ మోహన్ రెడ్డి వ్యూహాలు ప్రతివ్యూహాలతో సర్వసన్నద్ధమవుతున్నారు. కూటమి ప్రభుత్వానికి గట్టి పోటీ ఇచ్చేందుకు ఆయన వేస్తున్న అడుగులు రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ స్థానిక సంస్థల ఎన్నికలకు దూరంగా ఉంది. దీంతో తాడిపత్రి మున్సిపాలిటీ తప్పించి అన్నింటా వైసీపీ విజయం సాధించింది. అయితే ఇప్పుడు టీడీపీ పాలనపై వ్యతిరేకత తెచ్చేందుకు, తమ పార్టీపై సానుభూతి కురిసేందుకు జగన్ వేసిన వ్యూహం సక్సెస్ అయినట్లే కనపడుతుంది. ప్రతి చోట ఖచ్చితంగా నామినేషన్లు వేయాలని, ఏకగ్రీవం జరిగితే వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ కూడా ఇవ్వనని జగన్ నాడు చేసిన హెచ్చరికలను వేరే విధంగా చూసిన వారికి ఇప్పుడు అసలు విషయం అర్థమవుతుంది. జగన్ తన ఎత్తుగడలో భాగంగనే నామినేషన్లు వేయించి అభ్యర్థులను బరిలోకి దిగితే శాంతిభద్రతలు అదుపు తప్పి టీడీపీ పాలనపై వ్యతిరేకత ఏర్పడుతుందని అంచనా నిజమవుతుంది. గత రెండు రోజులుగా జరుగుతున్న నామినేషన్ల పర్వం చూస్తేనే ఇది ఎవరికైనా ఇట్టే అర్థమవుతుంది.మ్యాప్‌లు చూడండి ప్రతి సీటులోనూ పోటీకి... గత ఎన్నికల్లో జరిగిన పొరపాట్లను పునరావృతం కానివ్వకుండా, ఈసారి ప్రతి స్థానంలోనూ వైసీపీ అభ్యర్థిని పోటీకి నిలపాలని జగన్ పార్టీ శ్రేణులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఎక్కడా అధికార కూటమికి ఏకగ్రీవాలు చేసుకునే అవకాశం ఇవ్వకూడదని, ఒకవేళ ఏదైనా నియోజకవర్గంలో ఏకగ్రీవమైతే దానికి స్థానిక నాయకత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.కూటమి పార్టీలైన టీడీపీ, జనసేన, బీజేపీల మధ్య సీట్ల సర్దుబాటు చర్చలు పూర్తయి ఏ పార్టీ ఎక్కడ పోటీ చేయాలో అధికారికంగా ప్రకటించినప్పటికీ... వైఎస్ జగన్ మాత్రం ఒక అడుగు ముందే వేసి మొదటి విడతగా 27 మంది అభ్యర్థులతో కూడిన జాబితాను కూడా విడుదల చేశారు. గ్రౌండ్ రిపోర్టుల ఆధారంగా ప్రజాదరణ కలిగిన బలమైన అభ్యర్థులను ఎంపిక చేస్తూ కొత్త ఎత్తుగడలతో ముందుకు వెళ్తున్నారు.ఎన్నికల సమాచారం చూడండి.. ఎన్నికల సమయంలో అధికార యంత్రాంగం లేదా పోలీస్ వ్యవస్థల నుంచి ఎదురయ్యే ఒత్తిళ్లను, అక్రమాలను తట్టుకునేందుకు వీలుగా నియోజకవర్గాల వారీగా ప్రత్యేక లీగల్ సెల్స్, మీడియా సెల్స్‌ను ఏర్పాటు చేశారు. క్షేత్రస్థాయిలో ఏవైనా అధికార దుర్వినియోగ ఘటనలు జరిగితే వాటిని రికార్డ్ చేయడానికి 'డిజిటల్ డైరీ' విధానాన్ని తీసుకువచ్చారు.ఈ స్థానిక ఎన్నికలను కేవలం ఒక పోటీలా కాకుండా, మొన్నటి అసెంబ్లీ ఎన్నికల ఓటమి తర్వాత పార్టీని గ్రామ స్థాయి నుండి తిరిగి బలోపేతం చేసుకునే ఒక ప్రక్రియగా జగన్ భావిస్తున్నారు. అందుకోసం రీజనల్ కో-ఆర్డినేటర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లతో వరుస సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ ఎన్నికల్లో అధికార పార్టీ ఆగడాలు చూసి క్యాడర్ లోనూ కసి పెరుగుతుందని, అది తమకు వచ్చే సాధారణ ఎన్నికల్లో అనుకూలంగా మారుతుందని జగన్ అంచనా వేశారు. అనుకున్నట్లుగానే క్యాడర్ ఏకతాటిపైకి రావడంతో జగన్ పాచిక పారినట్లయింది. అధికార కూటమి సీట్ల సర్దుబాటు పూర్తి చేసుకుని పటిష్టంగా ఉన్న నేపథ్యంలో, జగన్ ముందస్తు వ్యూహాలు మరియు ఒంటరి పోరాటం క్షేత్రస్థాయిలో ఎంతవరకు ఓటర్లను ఆకర్షిస్తాయనే దానిపైనే ఆయన "పాచిక" సక్సెస్ ఆధారపడి ఉంటుంది. నామినేషన్లు వేయకుండా అడ్డుకుంటే అది తమకు కలసి వస్తుందని అంచనా వేస్తున్నారు జగన్.

## ఏపీలో 19 మున్సిపాలిటీల ఎన్నికల ప్రక్రియకు బ్రేక్



-మొదటిపేజీ తరువాయి

దాఖలును అడ్డుకున్నారని, గడువు పొడిగించి తగిన రక్షణ కల్పించాలని పిటిషన్‌లో కోరింది. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన అత్యున్నత న్యాయస్థానం, ప్రజాస్వామ్యబద్ధంగా, పారదర్శకంగా ఎన్నికలు జరగడం రాజ్యాంగ మౌలిక సూత్రమని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో, వైసీపీ చేసిన ఫిర్యాదులను, సమర్పించిన ఆధారాలను కేసుల వారీగా పరిశీలించి అక్టోబర్ 22వ తేదీలోగా నిర్ణయం తీసుకోవాలని ఎస్ఈసీని సుప్రీంకోర్టు ఆదేశించింది. అప్పటివరకు అభ్యర్థుల తుది జాబితాను ప్రచురించవద్దని స్పష్టం చేసింది. అక్టోబర్ 25న తుది జాబితాను విడుదల చేయాలని సూచించింది. సుప్రీంకోర్టు ఉత్తర్వులను పూర్తిగా పరిశీలించిన తర్వాతే తదుపరి చర్యలు ఉంటాయని ఎస్ఈసీ తన ప్రకటనలో తెలియజేసింది.

# జగన్‌ను ర్యాగింగ్ చేసిన విజయసాయి!

**విజయవాడ :** మాజీ ఎంపీ వి. విజయసాయిరెడ్డి దసరా పండుగ సందర్భంగా తాను స్థాపించబోయే కొత్త రాజకీయ పార్టీకి సంబంధించిన ముహూర్తాన్ని, ఆశయాలను వెల్లడిస్తూ కీలక ప్రకటన చేశారు. ఈ క్రమంలో ఆయన ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆకాంక్షలే ఎజెండాగా కొత్త పార్టీ ఆవిర్భవించబోతోందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో 2 పార్టీలు, రెండు కుటుంబాల దోపిడీకి ముగింపు పలకడం, కులపిచ్చి, మతపిచ్చి రాజకీయాలను రూపుమాపడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు విజయసాయిరెడ్డి తెలిపారు. అలాగే రెడ్ బుక్ రాజ్యాంగం, రప్పారప్పా ఫ్యాక్షన్ల నుంచి విముక్తి కల్పించి, కరువు కాటకాలు, కరెంటు కోతలు లేని ఆంధ్రప్రదేశ్‌ను నిర్మిస్తామని దసరా పండుగరోజు మాజీ ఎంపీ ప్రకటించారు.విజయసాయిరెడ్డి తన కొత్త పార్టీ ప్రకటన తేదీని, ముహూర్తాన్ని ప్రకటించారు. అన్నీ పదకొండులు వచ్చేలా చూసుకున్నారు. గతంలో దసరాకే పార్టీ పెడతానని చెప్పిన ఆయన .. పార్టీ పెట్టే రోజును దసరా రోజునుప్రకటించారు. ఆ రోజును, ముహూర్తాన్ని చూస్తే ఆయన జగన్ రెడ్డిని ర్యాగింగ్ చేశారని సులువుగా అర్థమైపోతుంది. 11వ నెల 11వ తేదీన సరిగ్గా ఉదయం 11 గంటల 11 నిమిషాలకు విజయవాడలోని ఏ-కన్వెన్షన్‌లో నూతన పార్టీని ఘనంగా ఆవిష్కరించనున్నట్లు ప్రకటించారు.గత ఎన్నికల్లో వైఎస్సార్సీపీ ఘోర పరాజయం పాలై కేవలం 11 అసెంబ్లీ స్థానాలకే పరిమితమైంది. అప్పట్నుంచి 11 అంటే వైసీపీ నేతలు ఉలిక్కి పడుతున్నారు. విపక్ష హోదా కూడా దక్కకుండా చేసిన ఆ 11 సంఖ్య జగన్‌కు, వైఎస్సార్సీపీ శ్రేణులకు రాజకీయంగా ఒక పెద్ద పీడకలగా మారింది. అలాంటి పచ్చి పుండుపై కారం చల్లేలా.. విజయసాయిరెడ్డి తన పార్టీ ప్రకటన ముహూర్తంలో నెల, తేదీ, గంటలు, నిమిషాలు అన్నీ కలిపి వరుసగా 11:11:11:11 వచ్చేలా పక్కాగా సెట్ చేశారు. గతంలో జగన్‌కు ఆర్థిక, రాజకీయ సలహాదారుగా నిలిచి లెక్కల మాస్టారు గా పేరుగాంచిన సాయిరెడ్డి.. ఇప్పుడు అదే లెక్కలతో జగన్ ఓటమి సంఖ్యను గుర్తుచేస్తూ పబ్లిక్‌గా ట్రోల్ చేశారుకేవలం ముహూర్తంతోనే ఆగకుండా పార్టీ ఎజెండా ద్వారా కూడా జగన్ పాలనను, వైఎస్సార్సీపీ మూలాలను విజయసాయిరెడ్డి తీవ్రంగా ఎద్దేవా చేశారు. రెండు పార్టీలు, రెండు కుటుంబాల దోపిడీకి ముగింపు పలికేలా.. రప్పరప్ప ఫ్యాక్షన్ల నుంచి విముక్తి కల్పించేలా.. జెన్-జీ నాయకుల తయారీ ఫ్యాక్టరీగా తమ పార్టీ వస్తోందని పోస్టర్‌లో పేర్కొనడం జగన్‌ను నేరుగా టార్గెట్ చేయడమే. అధికారాన్ని అడ్డుపెట్టుకుని సొంత ప్రయోజనాలు చూసుకున్నారని, యువతను కేవలం జేజేలు కొట్టే గుంపులుగా మార్చారని దశకంఠుడి అవలక్షణాలంటూ 10 పాయింట్లతో జగన్ రాజకీయ తీరును ఉతికి ఆరేశారు. నిన్నటిదాకా తమతో ఉన్న ముఖ్య నేతే ఇలా 11 నంబర్‌తో వ్యంగ్యాస్త్రాలు సంధించడం తాడేపల్లి ప్యాలెస్‌కు మింగుడుపడటం లేదుకొన్ని రోజుల కిందట విజయసాయిరెడ్డి పార్టీ ఆవిర్భావం ప్రకటన చేయాల్సి ఉండగా.. అనారోగ్యం కారణంగా వాయిదా వేసుకున్నట్లు ప్రకటించారు. ఆయుర్వేద చికిత్స తీసుకుంటున్నానని, త్వరలోనే పార్టీ ఏర్పాటుపై ప్రకటన చేస్తానన్నారు. అయితే వైసీపీ నుంచి బెదిరింపులకు పాల్పడటంతో ఆయన వెనక్కి తగ్గారని, మరికొన్ని వర్గాల వారు విజయసాయిరెడ్డిని భయపెట్టడంతో మాజీ ఎంపీ వెనక్కి తగ్గారని ప్రచారం జరిగింది. అయితే తాను పార్టీ పెట్టడంలో వెనక్కి తగ్గేదిలేదని, తనను ఎవరూ బెదిరించలేదన్నారు. రాష్ట్ర రాజకీయాల్లో మార్పు కోసం కచ్చితంగా తన పోరాటం కొనసాగుతుందన్నారు.

## వచ్చే వారం కృష్ణా, గోదావరి యాజమాన్య బోర్డుల సమావేశం

-మొదటిపేజీ తరువాయి

బోర్డు సమావేశాల్లో ప్రస్తావనకు రానున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాల మధ్య జలవివాదాలకు సంబంధించిన అంశాలు మరోమారు చర్చనీయాంశం కానున్నాయి. కృష్ణా, గోదావరి నదీ జలాల వినియోగం, రాష్ట్రాల మధ్య నీటి వాటాలు, ప్రాజెక్టుల అనుమతులు, పరస్పర ఫిర్యాదులపై చర్చించేందుకు ఈ నెలలో రెండు కీలక సమావేశాలు జరగనున్నాయి. ఈ నెల 26వ తేదీన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు, 30వ తేదీన గోదావరి నదీ యాజమాన్య బోర్డు సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ సమావేశాల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన అధికారులు, ఇంజనీర్లు పాల్గొననున్నారు. ఇప్పటికే పలు అంశాలపై రెండు రాష్ట్రాల మధ్య భిన్నాభిప్రాయాలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ సమావేశాల్లో జరిగే చర్చలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కృష్ణా నదీ జలాల పంపిణీ అంశం మరోసారి కేఆర్ఎంబీ సమావేశంలో ప్రధానంగా చర్చకు వచ్చే అవకాశం ఉంది. రెండు రాష్ట్రాల మధ్య నీటి వాటాలపై ఇటీవల జరిగిన త్రిసభ్య కమిటీ సమావేశంలోనూ ఏకాభిప్రాయం కుదరలేదు. ఈనెల 26న జరిగే బోర్డు సమావేశంలో ఈ అంశంపై ప్రధానంగా చర్చ జరగనుంది. రెండు రాష్ట్రాలు తమ వాదనలను బలంగా వినిపించేందుకు సిద్ధమవుతున్నాయి. ఇప్పటి వరకు 66, 34 నిష్పత్తిలోనే పంపకాలు జరగాలని ఏపీ అంటోంది. తెలంగాణ మాత్రం విభేదిస్తోంది. కృష్ణా బేసిన్ అధికంగా ఉన్నందున అందుకు అనుగుణంగా కేటాయింపులు జరగాలని అంటోంది. 70, 30 నిష్పత్తిన కృష్ణా జలాలు వినియోగించుకోవాలని తెలంగాణ కోరుతోంది. రెండు రాష్ట్రాల భిన్న వాదనల నేపథ్యంలో కేఆర్ఎంబీ సమావేశంలో జరగనున్న చర్చ కీలకం కానుంది.

### ఆ అంశాలపై చర్చ జరిగే అవకాశం

ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, జలాశయాల్లో కొద్దిపాటి ప్రవాహాల నేపథ్యంలో నీటి నిర్వహణ కీలకంగా మారింది. పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అందుబాటులో ఉన్న జలాలను ప్రణాళికాబద్ధంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఏర్పడింది. తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం ఇస్తూ జలాలను జాగ్రత్తగా వినియోగించుకోవాలని త్రిసభ్య కమిటీ సమావేశంలో సూత్రప్రాయంగా నిర్ణయించారు. జలాశయాల్లో అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, భవిష్యత్తు అవసరాలు, నీటి విడుదలకు సంబంధించిన అంశాలపై సమీక్ష జరిగే అవకాశం ఉంది. సాగునీటి అవసరాలతోపాటు పట్టణాలు, గ్రామాల తాగునీటి అవసరాలను సమన్వయం చేసుకోవడం కూడా కీలకంగా మారింది. రెండు రాష్ట్రాల నీటి వినియోగం, విద్యుత్ ఉత్పత్తి అంశాలపై పరస్పరం అభ్యంతరాలు ఉన్నాయి.

### టెలిమెట్రీల ఏర్పాటుపై

గతంలో కృష్ణా బోర్డుకు ఫిర్యాదులు కూడా చేసుకున్నారు. దాంతో ప్రాజెక్టుల ద్వారా నీటి వినియోగం, ఇతర అభ్యంతరాలు కూడా చర్చకు వచ్చే అవకాశముంది. కృష్ణా, గోదావరి నదులపై నిర్మించిన, నిర్మాణంలో ఉన్న వివిధ ప్రాజెక్టులకు సంబంధించి రెండు రాష్ట్రాలు ఇప్పటికే బోర్డులకు ఫిర్యాదులు చేశాయి. ప్రాజెక్టుల అనుమతులు, నీటి వినియోగం, నిబంధనల అమలు వంటి అంశాలపై పరస్పరం అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. బోర్డు సమావేశాల్లో ఆయా ఫిర్యాదులను ప్రస్తావించి, సంబంధిత అంశాలపై స్పష్టత కోరే అవకాశం ఉంది. ప్రాజెక్టులకు సంబంధించిన అనుమతుల స్థితి, బోర్డుల పరిధి, రాష్ట్రాలు పాటించాల్సిన మార్గదర్శకాలు వంటి అంశాలపై కూడా సమావేశాల్లో చర్చ జరిగే అవకాశం ఉంది. నదీ జలాల వినియోగాన్ని పర్యవేక్షించేందుకు టెలిమెట్రీ పరికరాల ఏర్పాటు అంశం కూడా సమావేశాల్లో ప్రస్తావనకు రానుంది. గతంలో కొన్ని చోట్ల ఏర్పాటు చేసినప్పటికీ అందులో కొన్ని సరిగ్గా పనిచేయడం లేదు. వాటి స్థానంలో కొత్తగా ఆధునిక పరికరాలను ఏర్పాటు చేయడంతో పాటు మరికొన్ని చోట్ల కూడా ఏర్పాటు చేయాలన్న డిమాండ్లు ఉన్నాయి. దీంతో నదీ యాజమాన్య బోర్డు సమావేశాల్లో టెలీమెట్రీ పరికరాల ఏర్పాటు అంశంపై కూడా చర్చ జరగనుంది.

### నిధుల అంశంపై చర్చ జరిగే అవకాశం

కృష్ణా, గోదావరి నదీ యాజమాన్య బోర్డుల నిర్వహణ, బడ్జెట్‌కు సంబంధించిన అంశాలు కూడా ప్రస్తావనకు రానున్నాయి. బోర్డులకు రెండు రాష్ట్రాల నుంచి రావాల్సిన నిధుల అంశంపై చర్చ జరగనుంది. ఈనెల 30న జరిగే గోదావరి బోర్డు సమావేశంలో పోలవరం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్స్ అంశం కూడా ప్రస్తావకు వచ్చే అవకాశం ఉంది. పోలవరం ప్రాజెక్టు కారణంగా ఎగువ ప్రాంతాల్లో నీటి మట్టాలు, ముంపు ప్రభావం, సంబంధిత ప్రాంతాలపై పడే పరిణామాలపై గతంలోనే తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేసింది. అధ్యయనం చేసి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరింది. ఆ మేరకు తగిన చర్యలు తీసుకుంటామని ప్రాజెక్టు అథారిటీ గతంలో తెలిపింది. జీఆర్ఎంబీ సమావేశంలో ఆ అంశంపై మరోమారు చర్చ జరిగే అవకాశం ఉంది. వీటితోపాటు రెండు రాష్ట్రాలకు సంబంధించిన ఇతర అంశాలు కూడా.. కృష్ణా, గోదావరి నదీ యాజమాన్య బోర్డు సమావేశాల్లో చర్చకు రానున్నాయి.

## 'రప్పా రప్పా' అంటూ రౌడీయిజం చేస్తే సహించం



-మొదటిపేజీ తరువాయి

సంతోషాలను త్యాగం చేస్తున్నారు" అని అన్నారు. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా దసరా ఉత్సవాలు, విజయవాడ ఉత్సవ్, వీఐపీల పర్యటనలు ప్రశాంతంగా ముగియడం వెనుక పోలీసుల నిరంతర శ్రమ అభినందనీయమని కొనియాడారు. 1959లో లడఖ్‌లో చైనా సైనికులతో పోరాడుతూ పది మంది పోలీసులు ప్రాణాలర్పించారని, వారి త్యాగాలకు గుర్తుగా ఏటా ఈ దినాన్ని జరుపుకుంటున్నామని గుర్తుచేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు, అభివృద్ధి, ప్రజల సంతోషం ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయని చంద్రబాబు విశ్లేషించారు. "భద్రత, భరోసా ఉన్న చోటకే పరిశ్రమలు, పెట్టుబడులు వస్తాయి. తద్వారానే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. అందుకే తాను అధికారంలో ఉన్న ప్రతిసారీ శాంతిభద్రతలకే అత్యంత ప్రాధాన్యత ఇస్తాను" అని పునరుద్ఘాటించారు. గతంలో ఫ్యాక్షన్‌ను నియంత్రించడం, నక్సలిజాన్ని ఎదుర్కోవడం, మత ఘర్షణలను అరికట్టడంలో ఏపీ పోలీసులు చూపిన ధైర్యసాహసాలు అసాధారణమైనవని ప్రశంసించారు. ఇటీవల దేశ భద్రతకు సంబంధించిన కుట్రలను ఛేదించిన కౌంటర్ ఇంటెలిజెన్స్ విభాగాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

### ఆధునిక నేరాలకు టెక్నాలజీతో చెక్

మారుతున్న కాలానికి అనుగుణంగా నేరాల స్వరూపం కూడా మారుతోందని, పోలీసు శాఖ దర్యాప్తు పద్ధతుల్లో ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలని సీఎం సూచించారు. "ఒకే ఒక్క ఫోన్ కాల్, ఒక లింక్‌తో కష్టపడి సంపాదించుకున్న సొమ్మును సైబర్ నేరగాళ్లు కొల్లగొడుతున్నారు. చదువుకున్నవారు సైతం మోసపోతున్నారు. ఇలాంటి నేరాలు జరగకుండా నివారించడమే ఉత్తమ పోలీసింగ్" అని పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డేటా అనలిటిక్స్, డ్రోన్ టెక్నాలజీ వంటి వాటిని పూర్తిస్థాయిలో వినియోగించి దర్యాప్తు సామర్థ్యాన్ని పెంచుకోవాలని కోరారు. గంజాయి, మాదకద్రవ్యాల నియంత్రణలో 'ఈగల్' బృందం చేస్తున్న కృషిని అభినందించారు. మహిళలపై నేరాలకు పాల్పడాలంటేనే భయపడే వాతావరణం కల్పించాలని ఆదేశించారు.

### అమరవీరుల కుటుంబాలకు అండగా ఉంటాం

పోలీసు అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని చంద్రబాబు భరోసా ఇచ్చారు. పోలీసుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. తీవ్రమైన ఒత్తిడితో పనిచేసే పోలీసులు యోగా, ధ్యానం ద్వారా మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలని సూచించారు. అమరుల త్యాగాలకు అసలైన నివాళి అర్పించాలంటే ప్రజలకు నిరంతర భద్రత కల్పించడమే మార్గమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హోంమంత్రి వంగలపూడి అనిత, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సీఎం చంద్రబాబు అమర జవాన్ స్మృతిచిహ్నం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. అనంతరం 'షహీద్ పుస్తక్ టోలీ', 'అమరులు వారు' పుస్తకాలను ఆవిష్కరించారు. పోలీసు శాఖ ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించి, ఫోరెన్సిక్, విపత్తు నిర్వహణ, ఆక్టోపస్ విభాగాల ఆధునిక ఆయుధాల గురించి అడిగి తెలుసుకున్నారు.

# అంబరాన్ని అంటిన కనకదుర్గ సంబరం.





తిరుగు రథయాత్ర ప్రారంభించిన మాజీ మంత్రి శాసనసభ్యులు కొణతాల.

**అనకాపల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 21:** పట్టణం లోని గవరపాలెం శతకం పట్టు వద్ద ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారి సంబరం మంగళవారం రాత్రి అత్యంత వైభవంగా సాగింది. దసరా రోజున జరిగే ఉత్సవం ఈ ఏడాది మరింత ఉత్సాహంగా సాగింది. ఉదయం నుండి అమ్మవారి ఉత్సవానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. మాజీ మంత్రి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ నవదుర్గల తిరుగు రథయాత్రను ప్రారంభించారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అయినను యువ నాయకుడు నవదుర్గ విగ్రహాల దాత దాడి జేవీర్, ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున విద్యుత్ దీపాలతో అలంకరించిన తీరు అందరినీ ఆకట్టుకుంది. సాయంత్రం నుండి సాగిన అమ్మవారి నవదుర్గల ఊరేగింపు కనుల పండుగగా సాగింది. ఈ నవదుర్గల ఊరేగింపులు సందడి చేసిన అనకాపల్లి సినిమా హీరో విక్రమ్, నిర్మాత కాండ్రేగుల నాయుడు. ఆర్టీసీ కాంప్లెక్స్ నుండి నెహ్రూ చౌక్ మెయిన్ రోడ్ మీదుగా చిన్న నాలుగు రోడ్ల జంక్షన్ చేపల బజార్ వన్ వే ట్రాఫిక్ నుండి గవరపాలెం వరకు సాగిన నవదుర్గల ఊరేగింపును తిలకించేందుకు ప్రజలు భక్తులు బారులు తీరారు. అమ్మవారికి ఎదురేగి మొక్కులు చెల్లించుకున్నారు. ఊరేగింపు తిలకించేందుకు వచ్చిన భక్తులతో మెయిన్ రోడ్ కిటకిటలాడింది. మేల తాళాలతో నేల వేషాలతో ఊరేగింపు సాగింది. అలాగే గవరపాలెం పరిసర ప్రాంతాల్లో సుమారు 10 స్టేజ్ ప్రోగ్రాములు తిలకించేందుకు జిల్లా నలుమూలల నుండి పెద్ద ఎత్తున ప్రజలు హాజరయ్యారు. దీంతో గవరపాలెం ప్రాంతం కిటకిటలాడింది ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వాహకులు, పోలీసులు చర్యలు చేపట్టడంతో ఉత్సవం సజావుగా సాగింది. ఆలయ శాశ్వత చైర్మన్ కాండ్రేగుల నాయుడు, వ్యవస్థాపకులు పీ.వీ రమణ, చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, గౌరీ పరమేశ్వరి కమిటీ సభ్యులు, మరిడిబాంబ కమిటీ సభ్యులు, పర్యవేక్షణలో సంబరం అంబరాన్ని అంటే విధంగా నిర్వహించారు.

# 27 నుండి 30 వరకు పాఠశాలలు, కళాశాలలకు సెలవులు.



శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్.

**పుట్టపర్తి, పెన్ సత్తా, అక్టోబర్ 21:** శ్రీ సత్యసాయి జిల్లాలో 2026 సంవత్సరానికి సంబంధించి స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలింగ్, ఓట్ల లెక్కింపు ప్రక్రియకు అవసరమైన ఏర్పాట్ల కోసం పాఠశాలలు, కళాశాలల భవనాలను వినియోగిస్తున్న నేపథ్యంలో, ఆయా విద్యాసంస్థలకు స్థానిక సెలవులు ప్రకటించినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. జిల్లాలోని ఆరు మున్సిపాలిటీల పరిధిలో పంపిణీ, స్వీకరణ, ఓట్ల లెక్కింపు కేంద్రాలుగా మరియు పోలింగ్ కేంద్రాలుగా వినియోగిస్తున్న పాఠశాలలు, కళాశాలలకు క్రింది తేదీల్లో సెలవులు ప్రకటించడమైనది. 27-10-2026: పోలింగ్‌కు ముందు రోజు. 28-10-2026: పోలింగ్ రోజు. 29-10-2026: ఓట్ల లెక్కింపునకు ముందు రోజు. 30-10-2026: ఓట్ల లెక్కింపు రోజు. ఎన్నికల నిర్వహణకు అవసర మైన ఏర్పాట్లు సజావుగా చేపట్టేందుకు, పై తేదీల్లో సంబంధిత పాఠశాలలు, కళాశాలలకు స్థానిక సెలవులు వర్తిస్తాయని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.ఎన్నికల విధుల నిర్వహణకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా అవసర మైన చర్యలు చేపట్టాలి అన్నారు.

# జారీ చేసినవారు: డా.పి.జగదీశ్వర రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి,

మాతృ మరణాల పై సర్వేలేన్స్, రెస్పాన్స్ కమిటీ సమీక్షా సమావేశం.



**విశాఖపట్నం, పెన్ సత్తా, అక్టోబర్ 21:** జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్ అధ్యక్షతన, డా.పి.జగదీశ్వర రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి అధ్వర్యంలో కలెక్టర్ సమావేశ మందిరంలో మాతృ మరణాల పై డిస్ట్రిక్ట్ మెటర్నిటీ డెత్ సర్వేలేన్స్ మరియు రెస్పాన్స్ కమిటీ సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జనవరి 2026 నుండి జూన్ 2026 వరకు జరిగిన 6 మాతృ మరణాలు, జనవరి లో న్యూ గాజువాక పట్టణ ఆరోగ్య కేంద్ర పరిదిలో 1 మాతృ మరణం, భవాని గార్డెన్స్ పట్టణ ఆరోగ్యకేంద్ర పరిదిలో 1 మాతృ మరణం, పి.ఎం.పాలెం పట్టణ ఆరోగ్య కేంద్ర పరిదిలో 1 మాతృ మరణం, మార్చి నెలలో గాజువాక ప్రాధమిక ఆరోగ్య కేంద్ర పరిదిలో 1 మాతృ మరణం, జూన్ నెలలో బాలాజీనగర్ పట్టణ ఆరోగ్య కేంద్ర పరిదిలో 1 మాతృ మరణం, సొంట్యాం ప్రాధమిక ఆరోగ్య కేంద్ర పరిదిలో 1 మాతృ మరణం పై సమీక్ష నిర్వహించారు. హైరిస్క్ గర్భిణీల డేటా తీసుకుని వాట్సాప్ గ్రూప్ లోనే కాకుండా కేసు హిస్టరీ మొత్తం తీసుకుని ప్రైవేటు హాస్పిటల్ ద్వారా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వారికి తెలియచేయాలి. ఈ మాతృమరణాలు సంబవించిన ప్రాంతాలలో గల ఏ.ఎన్.ఎం లందరికి ఇది ప్రధమ తప్పుగా భావించి రెండోసారి మాతృ మరణం సంభవిస్తే ఉద్యోగం నుండి తొలగించడం జరుగుతుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వారికీ ఆదేశించారు. అధిక రక్తపోటు గల కేసు లను గుర్తించి ముందుగా వారికీ డాక్టర్ యొక్క సేవలు అందించాలని వారికీ డయాగ్నోసిస్ అయ్యే ఖర్చులను రెడ్ క్రాస్ కేంద్రానికి గాని లేదా సి.ఎస్.ఆర్.నిధుల నుండి గాని అందించాలని, గర్భిణీల విభాగంనకు టోల్ ఫ్రీ నెంబర్ ఒకటి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వారి కార్యాలయం లో ఏర్పాటు చేసి అది ప్రైవేటు హాస్పిటల్స్ వారికీ తెలియచేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వారికి ఆదేశించారు. కేసు లను ప్రైవేటు హాస్పిటల్స్ కన్నా కె.జి.హెచ్.కు రిఫర్ చేయాలని మెడికల్ అధికారులకు, ఏ.ఎన్.ఎం.లకు ఆదేశించారు. ఇది అంతయు ఏ గర్భిణీ మరణించకూడదని జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కీ, సిబ్బందికి ఆదేశించారు. డా.పి.జగదీశ్వర రావు మాట్లాడుతూ మాతృమరణాలు ఇకముందు సంభవించకుండా చూసుకోవాల్సిన భాద్యత సంబందిత ఆరోగ్య కేంద్రం యొక్క మెడికల్ అధికారి పై ఆధారపడి ఉంటుందని, సంబందిత ఏఎన్ఎం సమయానికి గర్భిణీ స్త్రీ కి అవసర మైన సేవలను గుర్తించి అందజేయాలని తెలియచేశారు. ఇకముందు మాతృమరణాలు జరిగితే చర్యలు తీసుకోబడతాయని, హై రిస్క్ గర్భిణీ లు ప్రసవానికి వచ్చినప్పుడు కాలయాపన చేయకుండా కేజీహెచ్ కు గాని, వీజీహెచ్ కు గాని రిఫర్ చేయాలని ఆ విధంగా సురక్షిత కాన్పు జరిగేలా చూడాలని సూచించారు. ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు ఆడపిల్లలకు కౌమారదశ నుండి జరిగే మార్పుల పై అవగాహన కల్పించాలని, గర్భిణీ స్త్రీలకు గర్భాధారణ నుండి అవగాహన కల్పించాలని సూచించారు. హైరిస్క్ గర్భిణీలను ముందుగానే గుర్తించి వారికి సమయానికి టీకాలు, పోషకాహారం మొ' ఆరోగ్య సేవలను అందేటట్లు చూడాలని తెలియచేశారు. హై రిస్క్ గర్భిణీ స్త్రీలకు బర్త్ ప్లానింగ్ సక్రమంగా చేయాలని, ఆయా గర్భిణీ స్త్రీలకు ఆరోగ్య స్థితి పట్ల అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో డా.నరేంద్ర సింగ్, డీసీహెచ్ఎస్, ఏపీ వీవీపీ, డా.రోణంకి రమేష్, డిఎల్ఏటిఓ, డా.లూసి, డి.ఐ.ఒ., డా.ఉషాప్రసాద్, సూపరింటెండెంట్ వీజీహెచ్, డా.శైలజ గైనకాలజిస్ట్ హెచ్ఓడి కేజీహెచ్, డా.ఆర్.జనార్ధన్ జనరల్ మెడిసిన్ కేజీహెచ్, డా.గణేష్ అనస్తీసియా కె.జి.హెచ్., డా.బి.ఉమావతి డి.పి.ఎం.ఒ, బి.నాగేశ్వర రావు డెమో, డా.ఎన్.వి.సమత విమెన్ హెల్త్ ఆఫీసర్, డా.కె..అప్పారావు ఎన్టీఆర్ వైద్య సేవ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్, డా.వై.డి.కళ్యాణి మెడికల్ ఆఫీసర్, ప్రాధమిక, పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# జీవీఎంసీ ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థులకు బీ-ఫారాలు అందజేత.





**అనకాపల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 21**: రానున్న జీవీఎంసీ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తున్న జనసేన పార్టీ అభ్యర్థులకు మాజీ మంత్రి, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, మాజీ శాసనసభ్యులు, ఏపీయుఎఫ్ఐడిసి చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ బీ-ఫారాలను అందజేశారు. ఈ సందర్భంగా జీవీఎంసీ 109 వ వార్డు జనసేన పార్టీ అభ్యర్థిని బుద్ధ జ్యోతి కి, 110 వ వార్డు జనసేన పార్టీ అభ్యర్థిని తాడి శాంతి కుమారి కి, 112 వ వార్డు జనసేన పార్టీ అభ్యర్థిని ఆళ్ల వైష్ణవి కి బీ-ఫారాలను అందించారు. జీవీఎంసీ 108 వ వార్డు తెలుగుదేశం పార్టీ కార్పొరేట్ అభ్యర్థిగా కొణతాల సంతోష అప్పారావు నాయుడు సింధుజలకు మాజీ ఎమ్మెల్యే నియోజకవర్గ ఇన్చార్జ్ పీలా గోవిందు సత్యనారాయణ బి ఫారం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, కొణతాల జగ్గారావు నాయుడు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ నాయకురాలు దంగేటి వెంకట నాగమణి సుబ్రహ్మణ్యం టీడీపీ లో చేరిక.

✷ కండువా కప్పి తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే బండారు.



**కొత్తపేట, పెన్ సత్తా, అక్టోబర్ 21**:డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట గ్రామం పనసల దొడ్డి ఏరియాకు చెందిన వైసీపీ మాజీ వైస్ ఎంపీపీ దంగేటి వెంకట నాగమణి సుబ్రహ్మణ్యం వైసీపీ ని వీడి తన అనుచరుల కుటుంబాలతో కలిసి తెలుగుదేశం పార్టీలో చేరారు. వెంకట నాగమణి సుబ్రహ్మణ్యం కు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలుగుదేశం పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తన అనుచరులతో కలిసి సుబ్రహ్మణ్యం తెలుగుదేశం పార్టీలో చేరడంతో, స్థానిక ఎన్నికల వేల కొత్తపేట టీడీపీ లో కొత్త జోష్ వచ్చింది. ఎమ్మెల్యే సత్యానందరావు నాయకత్వంలో ఆయన ఆదేశాల మేరకు పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని సుబ్రహ్మణ్యం తెలిపారు. అలాగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీ తరపున పోటీ చేసే అభ్యర్థుల గెలుపు కోసం పూర్తి స్థాయిలో కృషి చేస్తానని దంగేటి సుబ్రహ్మణ్యం చెప్పారు.

## కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలి కొణతాల.

అనకాపల్లి అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది..



**అనకాపల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 21:** రానున్న జీవీఎంసీ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని మాజీ మంత్రి, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ పిలుపు నిచ్చారు. జీవీఎంసీ స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా 109 వ వార్డు కూటమి కుటుంబ సభ్యుల ఆత్మీయ సమావేశంలో ముఖ్య అతిథులుగా కొణతాల రామకృష్ణ, మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ పాల్గొన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆశీస్సులతో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందన్నారు. అనకాపల్లి పట్టణంలో గత రెండేళ్లలో సుమారు రూ.100 కోట్ల పైన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, తాగునీరు, రహదారులు, విద్యుత్, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇచ్చామని తెలిపారు. మహిళలకు రాజకీయాల్లో సముచిత ప్రాధాన్యం కల్పిస్తూ మేయర్ అభ్యర్థితో పాటు ఆరు వార్డులకు మహిళలకు అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ప్రతి బూత్‌లో కమిటీలను ఏర్పాటు చేసుకుని ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించాలని సూచించారు. జనసేన, తెలుగుదేశం, బీజేపీ నాయకులు ఐక్యంగా పనిచేసి కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కొణతాల రామకృష్ణ కోరారు.

## స్ట్రాంగ్ రూమ్ ల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టాలి.

- 24 గంటల సీసీటీవీ నిఘా తప్పనిసరి జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్.




**విశాఖపట్నం, పెన్ సత్తా, అక్టోబర్ 21:** పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థల రెండో సాధారణ ఎన్నికలు-2026 లో పోలైన బ్యాలెట్ బాక్సులను భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా బ్యాలెట్ బాక్సుల రవాణా, భద్రపరిచే ప్రక్రియ, భద్రత, నిరంతర పర్యవేక్షణలో ఎలాంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులతో పాటు ప్రిసైడింగ్ అధికారి డైరీ, బ్యాలెట్ పేపర్ అకౌంట్‌ను నిర్దేశించిన వాహనాలు, మార్గాల ద్వారా పోలీసు భద్రత నడుమ రిసెప్షన్ కేంద్రాలకు తరలించాలని సూచించారు. అభ్యర్థులు లేదా వారి పోలింగ్ ఏజెంట్లు ఈ వాహనాలను అనుసరించేందుకు అనుమతించాలని స్పష్టం చేశారు. ప్రతినిధుల సమక్షం లోనే బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరచాలని చెప్పారు. రెండు తాళాల విధానాన్ని తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద రెండు అంచెల భద్రతను ఏర్పాటు చేయాలని సూచించారు. స్ట్రాంగ్ రూమ్ లోపల, ప్రవేశ ద్వారం వద్ద, పరిసర ప్రాంతాల్లో 24 గంటల పాటు నిరంతర సీసీటీవీ నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్‌కు 100 మీటర్ల పరిధిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సీసీటీవీ దృశ్యాలను వీక్షించేలా స్క్రీన్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. స్ట్రాంగ్ రూమ్‌ను తెరిచే, మూసివేసే ప్రతి సందర్భంలో అభ్యర్థులు లేదా వారి ప్రతినిధుల సమక్షం ఉండేలా చూడటంతో పాటు, ఈ ప్రక్రియను వీడియో చిత్రీకరించాలన్నారు. లెక్కింపు రోజున ప్రతినిధుల సమక్షంలోనే స్ట్రాంగ్ రూమ్‌ను తెరవాలని చెప్పారు. రిటర్నింగ్ అధికారి/ఎన్నికల అధికారి స్ట్రాంగ్ రూమ్ ప్రాంగణాన్ని, భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేసి లాగ్‌బుక్, వీడియో రికార్డులను పరిశీలించాలని సూచించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేస్తూ, పోలైన బ్యాలెట్ బాక్సులకు పూర్తి భద్రత కల్పించాలని, ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ప్రత్యేక ఉత్తర్వుల ద్వారా స్పష్టం చేశారు.

## నూకాంబిక ఆలయంలో దసరా ఉత్సవాలు ముగింపు.





**అనకాపల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 21:** ఉత్తరాంధ్ర ఇలవేల్పు, గవరపాలెంలో వెలిసిన నూకాంబిక అమ్మవారి ఆలయంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు భాగంగా విజయదశమి పండగ సందర్భంగా జిల్లా కలెక్టర్ విజయకృష్ణ్, ఏపీ ఐఐసి ఎండి దినేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ శౌర్య పటేల్ ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ చైర్మన్ చైర్మన్ పీలా నాగశ్రీలు (గొల్ల బాబు) మర్యాదలతో స్వాగతం పలికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి,శమీ వృక్ష పూజలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారిని అమ్మవారి చిత్రపటాన్ని ప్రసాదాలు అందజేసారు. దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు ముగింపు సందర్భంగా బుధవారం ఆలయ మండపంలో పూర్ణాహుతి, అవవృధ స్నానములో పాల్గొన్న మాజీ మంత్రి, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ పీలా నాగశ్రీను (గొల్ల బాబు), కార్య నిర్వహణ అధికారి, ఆలయ ధర్మకర్తలు సూరే సతీష్, దాడి రవి కుమార్, పొలిమేర స్వాతి ఆనంద్, మారిశెట్టి శంకర్రావు, కాంద్రేగుల రాజారావు, మజ్జి జానకి శ్రీనివాస రావు, కొడుకుల శ్రీకాంత్, వడ్డాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి పైడిరాజు, యర్రవరపు సంతోషి కుమారి నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల విధుల్లో అలసత్వం వద్దు జిల్లా జాయింట్ కలెక్టర్ శౌర్య మాన్ పటేల్.







**అనకాపల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 21:** ఎన్నికల నిర్వహణలో అధికారులు అత్యంత అప్రమత్తంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అనకాపల్లి జిల్లా జాయింట్ కలెక్టర్ శౌర్య మాన్ పటేల్ స్పష్టం చేశారు. స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్, జిల్లా స్థాయి అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో త్వరలో జరగనున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ, పురపాలక, పంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు యంత్రాంగం సన్నద్ధం కావాలని ఆదేశించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో గత ఘటనలు, కేసుల వివరాలను మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, ఎస్హెచ్ఓలు, తహసీల్దార్ల నుంచి సేకరించి కట్టుదిట్ట మైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. మార్గ, మండల పటాల ఆధారంగా సున్నిత ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షించాలని, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ కాలనీల ఓటర్లను ఎవరైనా భయభ్రాంతులకు గురిచేసినా, ఓటు హక్కు వినియోగించుకోకుండా అడ్డుకున్నా కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం లేదా బెదిరించడం భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 171 ప్రకారం తీవ్ర నేరమని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకురాలు పూర్ణిమ దేవి పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాలను వాటి తీవ్రత ఆధారంగా విభజించి, ఆ వివరాలను నిర్దేశిత ప్రొఫార్మా-1 ద్వారా ముందస్తుగా సమర్పించాలని నిర్దేశించారు. అధికారులు సమన్వయంతో పనిచేస్తూ కేంద్రాల్లో ఓటర్లకు అవసర మైన కనీస సౌకర్యాలు కల్పించాలని, ఎస్ఈసీఎంఎస్ మొబైల్ యాప్ ద్వారా సమాచారాన్ని ఎప్పటి కప్పుడు చేరవేయాలని సూచించారు. ఓటర్లు రాని ప్రాంతాల పై ప్రత్యేక నివేదిక అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులతో పాటు గ్రామ రెవెన్యూ అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## అట్టహాసంగా వైసీపీ ఎంపీటీసీ అభ్యర్థి రావాడ రోజా ప్రియాంక నామినేషన్.

- భారీ ర్యాలీగా తరలివచ్చి నామినేషన్ దాఖలు
- నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న పైల శ్రీనివాసరావు, పి.ఎస్. రాజు



**పరవాడ, పెన్ సత్తా, అక్టోబర్ 21**: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆశీస్సులతో, పెందుర్తి నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్ రాజ్ మార్గదర్శకత్వంలో పెదముషిడివాడ వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ అభ్యర్థి రావాడ రోజా ప్రియాంక పరవాడ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి భారీ ర్యాలీగా తరలివచ్చి నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి విజయ్ ప్రకాష్, ఎంపీడీఓ మల్లికార్జున రావు కు సమర్పించారు. ఈ నామినేషన్ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పయిల శ్రీనివాసరావు, రాష్ట్ర ఎస్ఈసీ మెంబర్ పి.ఎస్. రాజు పాల్గొని ఆమెకు మద్దతుగా నిలిచారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామ వాలంటీర్‌గా సేవలందించిన రోజా ప్రియాంక, ప్రస్తుతం ఎంపీటీసీ అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలబడ్డారు. ఈ కార్యక్రమంలో పెదమూషిడివాడ వైసిపి నాయకుడు పల్లా అప్పారావు, మాజీ ఉప సర్పంచ్ అలమండ నారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, వై.సి.పి నాయకులు కలవలపల్లి సత్యనారాయణ, యలమర్తి బుజ్జి, ప్రవీణ్ కుమార్ , తదితరులు పాల్గొన్నారు.

## అనకాపల్లి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ గా మత్స్యకార మహిళకు అవకాశం కల్పించాలి.

సీఎం చంద్రబాబు కు, రాష్ట్ర మత్స్యకార సంఘాల విజ్ఞప్తి.

చింతకాయల సుజాత ముత్యాలకు అవకాశం కల్పించాలని మత్స్యకార సంఘాలు ప్రతిపాదన.



**పరవాడ, పెన్ సత్తా, అక్టోబర్ 21**: అనకాపల్లి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పదవిని మత్స్యకార మహిళకు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ సాంప్రదాయ మత్స్యకార కులాల సంక్షేమ సంఘాల నాయకులు చింతకాయల ముత్యాలు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు విజ్ఞప్తి చేశారు. ముత్యాలమ్మపాలెం మాజీ సర్పంచ్, రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ ఉపాధ్యక్షురాలు చింతకాయల సుజాత ముత్యాలుకు అవకాశం కల్పించాలని ప్రతిపాదించారు. మత్స్యకార సామాజిక వర్గానికి ఇప్పటివరకు దక్కని జిల్లా స్థాయి రాజకీయ ప్రాతినిధ్యాన్ని ఈసారి కల్పించాలని కోరారు. రాష్ట్ర సాంప్రదాయ మత్స్యకార కులాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు నడికుంటి అర్జున్‌తో పాటు పలువురు మత్స్యకార నాయకులు ఈ మేరకు ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. బీసీ మహిళా రిజర్వేషన్ పరిధిలో ఉన్న జెడ్పీ చైర్‌పర్సన్ పదవికి మత్స్యకార మహిళను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన 14 ఉపకులాల ప్రజలు పార్టీకి మద్దతుగా నిలుస్తున్నారని సుజాత ముత్యాలు పేర్కొన్నారు. ఇన్నేళ్లుగా రాజకీయంగా అండగా ఉంటున్న తమ సామాజిక వర్గానికి కీలక పదవుల్లో తగిన ప్రాతినిధ్యం లభించకపోవడం బాధాకరమన్నారు. మత్స్యకారుల రాజకీయ భాగస్వామ్యానికి ప్రాధాన్యమిస్తూ జెడ్పీ పీఠంపై తమ వర్గానికి అవకాశం కల్పించాలని కోరారు.అనకాపల్లి జిల్లాలో పరవాడ, అచ్యుతాపురం,రాంబిల్లి, ఎస్.రాయవరం, నక్కపల్లి, పాయకరావుపేట తదితర మండలాల్లో మత్స్యకార కుటుంబాలు గణనీయ సంఖ్యలో ఉన్నాయని సంఘాల నాయకులు తెలిపారు. రాష్ట్రంలో సుమారు 85 లక్షల మంది మత్స్యకారులు ఉన్నట్లు సంఘం పేర్కొంటోందని చెబుతూ, వారి సామాజిక, ఆర్థిక అభివృద్ధితోపాటు రాజకీయ ప్రాతినిధ్యానికీ ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సుదీర్ఘకాలం స్థానిక సంస్థల్లో పనిచేసిన అనుభవం.సుజాత ముత్యాలు గతంలో ముత్యాలమ్మపాలెం సర్పంచ్‌గా, ఎంపీటీసీగా, పరవాడ మండల పరిషత్ వైస్ ఎంపీపీగా పనిచేశారు. తెలుగు మహిళ, తెలుగు యువత విభాగాల్లో వివిధ బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ ఉపాధ్యక్షురాలిగా, ఆంధ్రప్రదేశ్ సాంప్రదాయ మత్స్యకార కులాల సంక్షేమ సంఘాల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. మత్స్యకార నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలనే డిమాండ్‌తో ఎన్‌టీపీసీ, ఫార్మాసిటీ పరిశ్రమల వద్ద నిరాహార దీక్ష చేపట్టి పోరాటం చేసినట్లు తెలిపారు. సర్పంచ్‌గా ఉన్న సమయంలో తన చెక్ పవర్ రద్దు చేసి జైలుకు పంపించారని కూడా మత్స్యకార సామాజిక వర్గం పేర్కొంది.జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా అవకాశం కల్పిస్తే జిల్లా సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తూ మత్స్యకార కుటుంబాల జీవనోపాధి, సంక్షేమం, తీర ప్రాంత గ్రామాల అభివృద్ధి, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తానని సుజాత ముత్యాలు తెలిపారు. మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మత్స్యకార సామాజిక వర్గానికి రాజకీయంగా సముచిత గుర్తింపు కల్పించే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూల నిర్ణయం తీసుకోవాలని సంఘాల నాయకులు కోరారు.

## దేవీ నవరాత్రుల ముగింపు సందర్భంగా భారీ అన్న సమారాధన

**అనకాపల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 21:** నిదానదొడ్డి లో వేంచేసియున్న కామాక్షి దేవి ఆలయంలో ముగిసిన దసరా నవరాత్రి మహోత్సవాలు. మహోత్సవాలు ముగింపు సందర్భంగా బుధవారం ఆలయం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు. వీరిని ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. అమ్మవారి అనుపు మహోత్సవం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమంలో పట్టణ సంఘం అధ్యక్షులు పొన్నాడ వెంకట సత్య నరసంహ ఆచారి (పెదబాబు), ప్రధాన కార్యదర్శి యండపల్లి మోహన్ బ్రహ్మాజీ, కోశాధికారి కిల్లాడ శ్రీనివాసరావు, పట్టణ స్వర్ణకారుల సంఘం అధ్యక్షులు వెదురుపాటి సుందరయ్య (బాబి), పట్టణ కార్పెంటర్ సంఘం అధ్యక్షుడు కోరుకొండ వెంకటరావు, విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



# ముగిసిన దేవి నవరాత్రి మహోత్సవాలు.





**అనకాపల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 21:** గౌరీ పంచాయతన దేవాలయంలో శ్రీదేవి నవరాత్రి మహోత్సవాలలో భాగంగా అర్చకులు అంపోలు గోపాల కృష్ణ శర్మ, అంపోలు రాంప్రసాద్ శర్మ, కోట శ్రీకర్ శర్మ ఆధ్వర్యంలో దసరా పండగ సందర్భంగా అమ్మవారి మూల విరాటకు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భారీ అన్న సమారాధాన్ని వర్తక సంఘ కార్యదర్శి కొణతాల లక్ష్మీనారాయణ (పెద్దబాబు) ప్రారంభించారు. భక్తులు అమ్మవారి దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు కర్రి సన్యాసి నాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్ , ఆళ్ళ మహాలక్ష్మి నాయుడు, మళ్ల సురేష్, ఆళ్ల ప్రసాద్ మరియు పాలకవర్గ సభ్యులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనడం జరిగింది.

# డీఎస్పీలకు రోజూ రూ. 60 లక్షల ఆదాయం

- ఎన్నికల్లో టీడీపీ అక్రమాలను ప్రోత్సహించినందుకు బహుమానం
- ఎస్వీ సతీష్ కుమార్ రెడ్డి సంచలన ఆరోపణలు
- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగారెడ్డి సతీష్ కుమార్ రెడ్డి
- లోకేష్ కోసం రాష్ట్రాన్ని రావణకాష్టంగా మారుస్తున్న చంద్రబాబు!
- ఎన్నికల్లో పోలీసుల అండతో టీడీపీ దాడులు, అరాచకాలు
- సుప్రీంకోర్టు తీర్పుతోనైనా పోలీసులు బుద్ధి తెచ్చుకోవాలి
- ఎల్లో మీడియా చౌకబారు రాతలతో జగన్ గారి పరపతిని తగ్గించలేరు
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్ కుమార్ రెడ్డి స్పష్టీకరణ




**తాడేపల్లి: పెన్ సత్తా, అక్టోబర్ 21:**రాష్ట్రంలో ఐపీఎస్, డీఎస్పీ స్థాయి అధికారులు అఫీషియల్ రౌడీలుగా మారిపోయి, ఎన్నికల్లో అక్రమ సంపాదన కోసం వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్ కుమార్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఒక్కో డీఎస్పీకి రోజుకు రూ. 60 లక్షలు, డీఐజీలకు కోట్లాది రూపాయలు ముడుపులు అందుతున్నాయని, కావాలంటే దీనిపై ఎవరైనా విచారణ చేసుకోవచ్చని ఆయన ఆరోపించారు. ఎన్నికలను స్వేచ్ఛగా నిర్వహించాల్సిన పోలీసులే అధికార పార్టీతో కుమ్మక్కై, కిందిస్థాయి సిబ్బందికి కూడా డబ్బులు పంచుతూ ఏకగ్రీవాల పేరుతో కోట్లు దండుకుంటున్నారని మండిపడ్డారు. నామినేషన్ కేంద్రాల వద్ద పోలీసుల సమక్షంలోనే మా అభ్యర్థులపై దాడులు జరుగుతున్నా, నామినేషన్ పత్రాలు చించేస్తున్నా పోలీసులు పట్టించుకోకుండా టీడీపీకి పూర్తిగా సహకరిస్తున్నారని ధ్వజమెత్తారు. . కడప మున్సిపాలిటీలో రూ. 40 కోట్లు వసూలు చేసి, అందులో సింహభాగాన్ని ఈ పోలీసు అధికారులకే పంచుతూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ఆయన ఆరోపించారు.

**ఆయన ఇంకా ఏమన్నారంటే...**

లోకేష్ రాజకీయ భవిష్యత్తు కోసం చంద్రబాబు..:

చంద్రబాబు చేస్తున్న నీచమైన రాజకీయాలను చూసి ప్రజలంతా అసహ్యించుకుంటున్నారు. లోకేష్ శునకానందం కోసం, ఆయన రాజకీయ భవిష్యత్తుపై చంద్రబాబుకు ఉన్న విపరీతమైన ప్రేమతో ఈ రాష్ట్రాన్ని రావణాకాష్టంగా మారుస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్లను అడ్డుకుంటూ టీడీపీ గూండాలు కట్టెలకు సర్జికల్ బ్లేడ్లు కట్టుకుని రోడ్లపై స్వైరవిహారం చేస్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదు. కడప మున్సిపల్ కార్పొరేషన్‌లో టీడీపీ మేయర్ అభ్యర్థుల నుంచి రూ.40 కోట్లు వసూలు చేసి, ఆ డబ్బును పోలీసులకు పంచుతూ వారి ద్వారా దౌర్జన్యాలు చేయిస్తున్నారు. డీఎస్పీ స్థాయి అధికారులు ఈ ఎన్నికల ద్వారానే ఏకంగా రూ.10 కోట్ల నుంచి రూ.20 కోట్ల వరకు సంపాదిస్తున్నారని టీడీపీ నాయకులే నాతో చెబుతున్నారు. నేను చేస్తున్నవి కేవలం ఆరోపణలు కావు, ఇవన్నీ నిజాలు, కావాలంటే ఎవరైనా సమగ్ర విచారణ చేసుకోవచ్చు. అదనపు డీజీ స్థాయిలో ఉన్న ఓ అధికారి భవిష్యత్తులో డీజీపీ పదవి కోసం టీడీపీ గూండాలు ఏం చేసినా చూస్తూ ఉండాలని ఆదేశాలు ఇచ్చారు.

**దాడులపై ఆధారాలున్నా పోలీసుల చర్యలు శూన్యం:**

మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి గారిపై జరిగిన దాడితో పాటు టీడీపీ నాయకులు చేస్తున్న దాడులు, ఆస్తుల ధ్వంసంపై సీసీటీవీ ఫుటేజీల వంటి ఆధారాలు ఉన్నా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఈ అరాచకాలను ఎవరూ ప్రశ్నించకూడదనే కుట్రతో పోలీసు వ్యవస్థను పూర్తిగా భ్రష్టు పట్టిస్తున్నారు. అధికార పార్టీకి వత్తాసు పలుకుతూ కిందిస్థాయి సిబ్బంది నుంచి ఉన్నతాధికారుల వరకు కోట్లు దండుకుంటున్నారనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలి. ఎన్నికలు స్వేచ్ఛగా, నిజాయితీగా, పారదర్శకంగా నిర్వహించలేనప్పుడు చంద్రబాబు నోటిఫికేషన్ ఎందుకు ఇచ్చినట్లు, నేరుగా తమ అభ్యర్థులనే ప్రకటించుకుంటే సరిపోయేది కదా. పరువు, మర్యాదలతో బతికే వారు, ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో రాజకీయాల్లోకి రావాలనుకునే వారు ఈ దౌర్జన్యాలను చూసి బెంబేలెత్తిపోతున్నారు. వైఎస్ జగన్ గారిని లక్ష్యంగా చేసుకుని ఎల్లో మీడియా చౌకబారు రాతలు రాస్తోంది. అసలు సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి చంద్రబాబు గొడ్డలి, చెల్లి, తల్లి అంటూ వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారు. ఎన్ని కుట్రలు చేసినా ప్రజల గుండెల్లో వైఎస్ జగన్‌గారే అసలు సిసలు హీరోగా నిలిచారు.

**అభ్యర్థులకు భద్రత కల్పించాలి.. దౌర్జన్యాలకు పాల్పడేవారిపై చర్యలు తీసుకోవాలి:**

సుప్రీంకోర్టు తీర్పుతోనైనా పోలీసులు, అధికారులు బుద్ధి తెచ్చుకోవాలి. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పునీతా సుప్రీంకోర్టు ఆదేశాలను కచ్చితంగా అమలు చేసి, ప్రతి అభ్యర్థి భయం లేకుండా స్వేచ్ఛగా నామినేషన్ వేసుకునే పరిస్థితిని కల్పించాలి. నామినేషన్ కేంద్రాల వద్ద తగిన భద్రత కల్పించడంతో పాటు దాడులు, బెదిరింపులు, ఆస్తుల ధ్వంసంపై నమోదైన ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకోవాలి. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా ఎన్నికల సంఘం తన రాజ్యాంగబద్ధ బాధ్యతను నిర్వర్తించాలి. పోలీసులు, ఎన్నికల అధికారులు ఇకనైనా చట్టబద్ధంగా వ్యవహరించాలి. అధికార పార్టీకి ఒక న్యాయం, ప్రతిపక్షానికి మరో న్యాయం అనే పద్ధతిని విడనాడాలి. ఎన్నికలంటే ప్రజాసేవకు అవకాశం కావాలి కానీ, ప్రాణాలకు ముప్పు తెచ్చే పరిస్థితి ఉండకూడదు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా వ్యవహరిస్తున్న పాలకులకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారు. ప్రజాస్వామ్యంలో గెలవాల్సింది దౌర్జన్యం కాదు, డబ్బు కాదు, అధికార దుర్వినియోగం కాదు, ప్రజల తీర్పు మాత్రమే. ప్రజలు గెలవాలి, ప్రజాస్వామ్యం గెలవాలి అనే లక్ష్యంతో మా పోరాటం కొనసాగుతుందని సతీష్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

# జెడ్పీటీసీ స్థానాలకు మొదటి రోజు మూడు నామినేషన్లు



**పరిషత్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జేసీ జి. విద్యాధరికి నామినేషన్ పత్రాల సమర్పణ**

**విశాఖపట్నం, అక్టోబర్ 21 పెన్ సత్తా, అక్టోబర్ 21: :** విశాఖపట్నం జిల్లాలో గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియలో భాగంగా మొదటి రోజు బుధవారం జెడ్పీటీసీ స్థానాలకు ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రంలో రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరికి అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను సమర్పించారు. పద్మనాభం జెడ్పీటీసీ స్థానానికి తెలుగుదేశం పార్టీకి చెందిన కాళ్ల పద్మ, కాళ్ల సత్యవతి నామినేషన్లు దాఖలు చేయగా, ఆనందపురం జెడ్పీటీసీ స్థానానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన మజ్జి వెంకటరావు నామినేషన్ పత్రాలను సమర్పించారు. దీంతో మొదటి రోజు జెడ్పీటీసీ స్థానాలకు మొత్తం మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం అభ్యర్థులు నిర్ణీత గడువులోగా తమ నామినేషన్లను సమర్పించాలని ఎన్నికల అధికారులు సూచించారు.

# నిజరూప అలంకరణ లో భక్తులకు దర్శనమిచ్చిన కన్యకా పరమేశ్వరి.



**అనకాపల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 21:** పట్టణంలో ప్రసిద్ధి చెందిన వాసవి కన్యకా పరమేశ్వరి శరన్నవరాత్రి మహోత్సవం, దసరా పండుగ సందర్భంగా అమ్మవారు నిజరూప అలంకరణ లో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ మండపంలో బేడసేవ, శ్రీ చక్ర అభిషేకాలు, నక్షత్ర హారతి, గోపూజ నిర్వహించారు. అమ్మవారికి లక్ష పుష్పాలతో అర్చన ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు వుప్పల రవిరామ్ జవహర్, కార్యదర్శి, శ్రీధరాల సోమరాజు, కోశాధికారి కడిమిశెట్టి అచ్యుతరామయ్య, ఉత్సవ కమిటీ చైర్మన్ గ్రంధి వివిఎస్ మాణిక్యం, భక్తులు తదిరులు పాల్గొన్నారు.

# సుప్రీంకోర్టు ఆదేశాలను స్వాగతిస్తున్నాం

**తాడేపల్లి: పెన్ సత్తా, అక్టోబర్ 21:** రాష్ట్రంలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బరితెగిస్తున్న వెన్నుపోటు పార్టీ ముఠాలతో పాటు ఎస్ఈసీకి సుప్రీంకోర్టు ఇవాళ ఇచ్చిన ఆదేశాలు చెంపపెట్టులా ఉన్నాయని వైఎస్సార్సీపీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను స్వాగతిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటికైనా సుప్రీంకోర్టు ఆదేశాలను ఎస్ఈసీ అమలు చేయాలని, తన విస్తృత అధికారాలను వాడి ఎన్నికలు స్వేచ్ఛగా జరిగేలా చూడాలని సజ్జల రామకృష్ణారెడ్డి కోరారు. ఇవాళ కూడా పరిషత్ ఎన్నికల నామినేషన్ల సందర్భంగా 11 జిల్లాల్లో 76 ఘటనలు జరిగాయని, సుప్రీంకోర్టు ఆదేశాలున్నా బరితెగిస్తున్న వ్యవహారాన్ని తిరిగి అత్యున్నత న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్తామని సజ్జల రామకృష్ణారెడ్డి హెచ్చరించారు.

ప్రెస్ మీట్లో సజ్జల రామకృష్ణారెడ్డి ఇంకేమన్నారంటే...

**పరిషత్ ఎన్నికల్లోనూ అదే తీరు**

స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి కార్పోరేషన్లు, మున్సిపాలిటీల నామినేషన్ల ఉపసంహరణ గడువు ఇవాల్టితో ముగిసింది. అలాగే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. ఈ రెండు ఓవర్ ల్యాప్ కావడం గందరగోళానికి దారి తీస్తోంది. ఇది కాకుండా మున్సిపల్ ఎన్నికల్లో నామినేషన్లు వేయకుండా మా అభ్యర్థుల్ని అడ్డుకోవడం, స్క్రూటినీలో అడ్డగోలుగా తిరస్కరించడం, స్క్రూటినీకి మా అభ్యర్థులు రానివ్వకుండా అడ్డుకోవడం చేశారు. అలాగే విత్ డ్రా చేసుకోమనే బెదిరింపులు కూడా కొనసాగాయి. ఆ విధంగా పోలీసుల తప్పుడు కేసులు, వీళ్ల అండతో టీడీపీ నాయకుల బెదిరింపులు కొనసాగాయి. ఈ కారణాల వల్లే మా అభ్యర్థులు కొన్ని చోట్ల విత్ డ్రా చేసుకున్నారు తప్ప డమ్మీగా నిలబడటమో, వైఎస్సార్సీపీ తరపున నిలబడాలన్న కోరిక వారికి లేకపోవడమూ కాదు. పోలీసులు, అధికారుల నుంచి వస్తున్న ఒత్తిళ్ల నుంచి నుంచి తప్పించుకునేందుకు, గంజాయి, ఇతర తప్పుడు కేసుల్లో ఇరికిస్తామనే బెదిరింపులు వస్తూనే ఉన్నాయి. ఇవాళ మొదలైన పరిషత్ ఎన్నికల నామినేషన్లలోనూ ఇవన్నీ కొనసాగుతున్నాయి. రాష్ట్ర ఎన్నికల కమిషన్ కు వీటిపై ఫిర్యాదులు చేస్తున్నా ప్రయోజనం ఉండటం లేదు. పోలీసులకు, డీజీపీకి ఫిర్యాదు చేస్తున్నా ఫలితం లేదని ఎస్ఈసీకి చెప్తే .. ఆయన ఆ ఫిర్యాదుల్ని తిరిగి వారికే పంపడం, అధికారులకు నీతి సూత్రాలు చెప్పడం జరుగుతూనే ఉన్నాయి. ఆచరణలో మాకు పై నుంచి ఒత్తిడి ఉంది, ఏమనుకోకండి, మీరు నామినేషన్లు వేయొద్దని బుజ్జగింపులు, బెదిరింపులు, ఇవేవీ కుదరకపోతే తప్పుడు కేసులు పెడుతున్నారు. వీటిపైనే మేం కింది కోర్టుల్లో పిటిషన్లు దాఖలు చేసినా ఫలితం లేక సుప్రీంకోర్టు వరకూ వెళ్లాం.

**సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం**

వీటి మీద సుప్రీంకోర్టు ఒక మంచి తీర్పు ఇచ్చింది. ఇది చాలా సంతోషకరమైన విషయం. మేం ఫిర్యాదు చేసిన మున్సిపాలిటీల్లో నామినేషన్ల తుది జాబితా ఖరారు 25వ తేదీ వరకూ వాయిదా వేయాలని, రేపు సాయంత్రం వరకూ ఫిర్యాదులపై ఓ నిర్ణయం తీసుకోవాలని చెప్పడం, డీజీపీకి సీసీటీవీ కెమెరాలు పెట్టాలని చెప్పడం మంచి పరిణామాలే. ఇప్పటికైనా రాష్ట్ర ఎన్నికల కమిషన్ తన అధికారాలు ఉపయోగించి సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ఈ ప్రక్రియ పూర్తి చేస్తుందని ఆశిస్తున్నాం. రాష్ట్ర ఎన్నికల కమిషన్ తో పాటు డీజీపీ కూడా ఇవన్నీ పాటించినట్లు కాంప్లయెన్స్ రిపోర్ట్ 27వ తేదీ కల్లా ఇవ్వాలని సుప్రీంకోర్టు చెప్పింది. సీసీటీవీ కెమెరాలు లేవని చెప్తే అదో పెద్ద లోపం అవుతుంది. గతంలో హైకోర్టు, ఇప్పుడు సుప్రీంకోర్టు కూడా సీసీ కెమెరాలు పెట్టాలని చెప్పాయి. ఇదంతా జరుగుతుండగానే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లోనూ పోలీసుల అండతో ఇలాంటి కుట్రల్ని అమలు చేస్తున్నారు. టీడీపీ కన్నుసన్నల్లో నడిచే పోలీసు అధికారులతో, నిష్పాక్షికంగా ఉండాల్సిన ఎన్నికల అధికారులు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారు. టీడీపీ చెప్పుచేతల్లో ఉండి వాళ్లు చెప్పినట్లు వింటున్నారు. విజిలెన్స్ కేసుల భయంతోనో, రెడ్ బుక్ వల్ల ఇబ్బందులు వస్తాయనో భయంతోనే, ఈ ప్రభుత్వం వల్ల ప్రయోజనాలు పొందుతున్న వారో ఇలాంటి అధికార దుర్వినియోగం చేస్తున్నారు.

**ఇవాళ 11 జిల్లాల్లో 76 ఘటనలు**

ఇవాళ 11 జిల్లాల్లో ఇలాంటి 76 దాడులు, నామినేషన్లు వేయనివ్వకుండా అడ్డుకోవడం, నామినేషన్ పత్రాలు చించేయడం వంటి ఘటనలు జరిగాయి. వైఎస్సార్ జిల్లాలో 22, అన్నమయ్య జిల్లాలో 11, పల్నాడు జిల్లాలో 18, తిరుపతి జిల్లా 11, చిత్తూరు జిల్లా 2, ప్రకాశం జిల్లా 4, కర్నూలు జిల్లా 2, నంద్యాల జిల్లా 2, అనంతపురం జిల్లా 2, సత్యసాయి జిల్లా 1, కాకినాడ జిల్లా ఒకటి కలిపి ఇలాంటి 76 ఘటనలు జరిగాయి. ఇందులో టీడీపీ శ్రేణులు పోలీసుల అండతో దాడులు చేసిన ఘటనలు 11, పోలీసుల అండతో స్టేషన్లకు తరలింపులు చేసిన ఘటనలు 14, పోలీసుల గృహనిర్బంధ ఘటనలు 12, పోలీసుల అడ్డగింతలు, బెదిరింపులు, ఇతర ఆంక్షలు 14, నామినేషన్ పత్రాలు చించేసిన ఘటనలు 7, నామినేషన పత్రాలు లాక్కొన ఘటనలు 2 ఉన్నాయి. గతంలో చెదురుమదురు ఘటనల మధ్య పోలింగ్ జరిగేది. కానీ ఇప్పుడు నామినేషన్ల నుంచే ఇవన్నీ మొదలుపెట్టేశాడు. ఓటమి భయంతో చంద్రబాబు, ఆయన కుమారుడి దర్శకత్వంలో ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్నారు. సుప్రీంకోర్టు దృష్టిలో ఉందని తెలిసీ బరితెగించి మరీ ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్నారు. ఇవన్నీ తిరిగి సుప్రీంకోర్టు ముందు పెడతాం. ఈ ఘటనలకు కారకులైన అధికారుల్ని బదిలీ చేయాలి, వీఆర్ కు పంపాలని ఎస్ఈసీని ఇప్పటికే కోరాం.

# ఢిల్లీలో మళ్లీ వాయు కాలుష్యం

దేశ రాజధాని ఢిల్లీతో పాటు పరిసర ప్రాంతాల్లో వాయు కాలుష్యం మరోసారి ఆందోళన కలిగిస్తోంది. గాలి నాణ్యత సూచీ దిగజారడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. కాలుష్య నియంత్రణ చర్యలను వేగవంతం చేసేందుకు ఢిల్లీ-ఎన్‌సీఆర్ పరిధిలో గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (జీఆర్‌ఏపీ) స్టేజ్-1ను తక్షణమే అమలు చేస్తున్నట్లు వాయు నాణ్యత నిర్వహణ కమిషన్ (సీఏక్యూఎం) బుధవారం ప్రకటించింది. రానున్న రోజుల్లోనూ గాలి నాణ్యత ఇదే స్థాయిలో కొనసాగే అవకాశం ఉందన్న అంచనాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది.



### ఒక్కరోజులోనే పెరిగిన కాలుష్యం

ఢిల్లీలో అక్టోబర్ 20న వాయు నాణ్యత సూచీ (ఏక్యూఐ) 179గా నమోదైంది. ఇది 'మోస్తరు' కేటగిరీ పరిధిలోకి వస్తుంది. అయితే అక్టోబర్ 21న మధ్యాహ్నం 2 గంటలకు ఈ సూచీ 244కు చేరింది. దీంతో గాలి నాణ్యత 'పూర్' కేటగిరీలోకి వెళ్లింది. ఒక్కరోజు వ్యవధిలోనే కాలుష్య స్థాయిలు గణనీయంగా పెరగడం అధికారులను అప్రమత్తం చేసింది. భారత వాతావరణ విభాగం (ఐఎండీ), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటియరాలజీ (ఐఐటీఎం) అంచనాల ప్రకారం, రానున్న రోజుల్లోనూ ఢిల్లీలో గాలి నాణ్యత 'పూర్' కేటగిరీలో కొనసాగే అవకాశాలున్నాయి. ఈ పరిస్థితిని సమీక్షించిన, భారత వాతావరణ శాఖ, ఇతర సంస్థలు కాలుష్యాన్ని మరింత పెరగకుండా నిరోధించేందుకు తొలి దశ చర్యలను అమలు చేయాలని నిర్ణయించింది.

### జీఆర్‌ఏపీ స్టేజ్-1 ఎందుకు?

వాయు కాలుష్యం పెరుగుతున్నప్పుడు పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి దశలవారీగా చర్యలు చేపట్టే విధానమే గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్. గాలి నాణ్యత ఆధారంగా వివిధ దశల్లో నియంత్రణ చర్యలను అమలు చేస్తారు. ప్రస్తుతం ఢిల్లీలో ఏక్యూఐ 244కు చేరడంతో తొలి దశను అమల్లోకి తీసుకొచ్చారు. ఈ నిర్ణయం ఢిల్లీకి మాత్రమే పరిమితం కాకుండా మొత్తం జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్) పరిధిలో వర్తిస్తుందని సీఏక్యూఎం స్పష్టం చేసింది. సంబంధిత ప్రభుత్వ శాఖలు, స్థానిక సంస్థలు, అమలు చేసే ఇతర విభాగాలు తమ పరిధిలోని చర్యలను పర్యవేక్షించాలని ఆదేశించింది. ఇప్పటికే అమల్లో ఉన్న కాలుష్య నియంత్రణ మార్గదర్శకాలను మరింత కట్టుదిట్టంగా అమలు చేయాలని సూచించింది. గాలి నాణ్యత మరింత దిగజారకుండా నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని తెలిపింది. పౌరులు కూడా జీఆర్‌ఏపీ స్టేజ్-1లో సూచించిన మార్గదర్శకాలను పాటించాలని కోరింది.

### పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తాం

ఢిల్లీతో పాటు ఎన్‌సీఆర్‌లో గాలి నాణ్యతను అధికారులు నిరంతరం గమనిస్తారని సీఏక్యూఎం తెలిపింది. వాయు కాలుష్య స్థాయిలు, వాతావరణ శాఖలు వెల్లడించే భవిష్యత్ అంచనాలను బట్టి తదుపరి నిర్ణయాలు తీసుకుంటామని పేర్కొంది. అవసరాన్ని బట్టి అదనపు చర్యలపై సమీక్ష ఉంటుందని వెల్లడించింది. కాలుష్యాన్ని నియంత్రించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని ఈ ఆదేశాలు స్పష్టం చేస్తున్నాయి. జీఆర్‌ఏపీ తొలి దశ అమలుతో కాలుష్య నియంత్రణకు సంబంధించిన ప్రస్తుత చర్యలను ముమ్మరం చేయడంపై అధికారులు దృష్టి సారించనున్నారు.

### గత పదేళ్లలో కాలుష్యం తీవ్ర సమస్య: మంత్రి

ఢిల్లీలో వాయు కాలుష్యంపై పర్యావరణ శాఖ మంత్రి మంజీందర్ సింగ్ సిర్సా ఆందోళన వ్యక్తం చేశారు. గత పదేళ్ల నుంచి 12 ఏళ్ల కాలంలో రాజధానిలో గాలి నాణ్యత తీవ్రంగా దెబ్బతిన్నదని వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వాలు కాలుష్యానికి పంజాబ్, ఉత్తర్‌ప్రదేశ్, హరియాణా, రాజస్థాన్ వంటి రాష్ట్రాలను బాధ్యులుగా చూపుతూ వచ్చాయని, అయితే సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోలేకపోయాయని విమర్శించారు. అదే సమయంలో ప్రస్తుత ఏడాదిలో ఇప్పటివరకు 214 రోజులు 'గుడ్' లేదా 'మోడరేట్' కేటగిరీల్లో గాలి నాణ్యత నమోదైందని మంత్రి వెల్లడించారు. కొవిడ్ ప్రభావిత సంవత్సరాన్ని మినహాయించి చూస్తే, గత 12 ఏళ్లలో ఇదే అత్యధికమని పేర్కొన్నారు. ప్రభుత్వ చర్యలతో పాటు ఢిల్లీ ప్రజల సహకారం వల్లే ఈ ఫలితం సాధ్యమైందని తెలిపారు.

# ఆందోళనలు హింసకు దారితీస్తాయి

ప్రత్యేక ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ (ఎస్ఈఎం) జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపును సవాలు చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ నేతలు సౌరవ్ దాస్, అశుతోశ్ రాంకా దాఖలు చేసిన పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు కీలక సూచనలు చేసింది. స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ వద్ద విచారణ పూర్తయ్యే వరకు వేచి చూడాలని పేర్కొంది. అప్పటికీ సమస్య పరిష్కారం కాకపోతే అప్పీలేట్ కోర్టును ఆశ్రయించాలని జస్టిస్ సుబ్రమణియం ప్రసాద్ ధర్మాసనం సూచించింది. అలాగే ఫ్రాన్స్‌లో విద్యార్థుల ఆందోళనలు అగ్నిప్రమాదాలు, దోపిడీలకు దారితీసిన పరిణామాలను ఈ సందర్భంగా ప్రస్తావించింది. దీంతో సీజేపీ నేతలు హైకోర్టులో తమ పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు.




సీజేపీ నేతలు సౌరవ్ దాస్, ఆశుతోశ్ రాంకాలను అక్టోబర్ 13న పోలీసులు అరెస్టు చేశారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరసన చేపట్టే క్రమంలో వారు పోలీసుల బారికేడ్లను దాటి అక్కడికి ప్రవేశించినట్లు ఆరోపణలు ఉన్నాయి. భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ నినాదాలు చేసినట్లు పేర్కొన్నారు. జంతర్‌మంతర్‌ను నిరసన ప్రదేశంగా గుర్తించిన అనుమతులను రద్దు చేసిన తర్వాత అక్కడికి వెళ్లడంపై పోలీసులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో తమ న్యాయ కస్టడీని పొడిగిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ సీజేపీ నేతలు ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. వారి కస్టడీ గడువు బుధవారంతో ముగియున్న నేపథ్యంలో పిటిషన్?ను అత్యవసరంగా విచారించేందుకు న్యాయస్థానం అంగీకరించింది. అయితే ప్రత్యామ్నాయ న్యాయ మార్గాలను అనుసరించకుండా నేరుగా హైకోర్టును ఎందుకు ఆశ్రయించారని ధర్మాసనం ప్రశ్నించింది. సంబంధిత ఎస్ఈఎం విచారణ కోసం వేచి చూడాల్సిన అవసరాన్ని కూడా ప్రస్తావించింది. దీంతో పిటిషనర్లు తమ పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు.

### బారికేడ్లు దాటడంపై కోర్టు అభ్యంతరం

జస్టిస్ సుబ్రమణియం ప్రసాద్ నేతృత్వంలోని ధర్మాసనం నిరసనల నిర్వహణలో పోలీసుల అనుమతి ప్రాధాన్యాన్ని వివరించింది. జంతర్‌మంతర్ నిరసన ప్రదేశంగా గుర్తింపు కోల్పోయిన తర్వాత కూడా అక్కడికి వెళ్లాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించింది. బారికేడ్లను ఏర్పాటు చేయడం వెనుక నిర్దిష్టమైన ఉద్దేశం ఉంటుందని, వాటిని దాటడం వల్ల ఇతరులు కూడా ఆ ప్రాంతంలోకి ప్రవేశించే అవకాశం ఏర్పడుతుందని పేర్కొంది. నిరసనకారుల నియంత్రణలో లేని వ్యక్తులు అక్కడికి చేరితే పరిస్థితులు సంక్లిష్టంగా మారవచ్చని ధర్మాసనం అభిప్రాయపడింది. ఆందోళనకు సంబంధం లేని వారు ప్రవేశించి గందరగోళం సృష్టిస్తే, దాని ప్రభావం అసలు నిరసనకారులపైనా పడే ప్రమాదం ఉంటుందని సూచించింది. నిరసనలకు అనుమతి తీసుకోవడం అనేది ఆందోళనలను అడ్డుకోవడానికి మాత్రమే కాదని కోర్టు స్పష్టం చేసింది. ఇతరులు వచ్చి పరిస్థితులను చెడగొట్టకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడటం కూడా పోలీసుల అనుమతి విధానంలో కీలక ఉద్దేశమని వివరించింది.

### ఫ్రాన్స్ అల్లర్లతో పోలిక ఎందుకు?

విద్యార్థుల ఆందోళనలుగా ప్రారంభమైన నిరసనలు హింసాత్మక ఘటనలకు దారితీసిన ఉదంతాలు దేశ సరిహద్దులకు పరిమితం కాలేదని హైకోర్టు పేర్కొంది. ఫ్రాన్స్‌లో విద్యార్థుల నేతృత్వంలో మొదలైన నిరసనలు చివరకు నిప్పంటించే ఘటనలు, దోపిడీలకు దారితీసిన పరిణామాలను ఉదాహరణగా ప్రస్తావించింది. నిరసన ప్రారంభమైనప్పుడు దాని ఉద్దేశం ఒకటిగా ఉన్నా, ఆ తర్వాత పరిస్థితులు మారే అవకాశం ఉంటుందని ధర్మాసనం అభిప్రాయపడింది. శాంతిభద్రతలకు ముప్పు ఏర్పడే అవకాశం ఉన్నప్పుడు నిరసన నిర్వాహకులు ఎవరు? వారి అనుబంధ సంస్థ ఏమిటి? ఆ సంఘం లక్ష్యాలేంటి? అనే అంశాలు ప్రాధాన్యం సంతరించుకుంటాయని పేర్కొంది. అయితే, నిషేధం లేదా అనుమతి రద్దు చేసిన ప్రదేశంలో నిరసన చేపట్టడం ఎంతవరకు తీవ్రమైన చర్యగా పరిగణించాలనే అంశాన్ని కూడా కోర్టు ప్రస్తావించింది. బారికేడ్లు దాటి వెళ్లిన వ్యవహారంపై చట్టపరమైన అంశాలను ప్రత్యేకంగా పరిశీలిస్తామని తెలిపింది. నిరసన నిర్వహించిన తీరుపై అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ, ఆ చర్యల చట్టబద్ధతను పరిశీలించడం వేరే అంశమని ధర్మాసనం పేర్కొంది.

### 'మీరు జెన్-జెడ్ కాదు'

విచారణ సందర్భంగా సీజేపీ నేతల వయసును కూడా ధర్మాసనం అడిగి తెలుసుకుంది. సౌరవ్ దాస్ వయసు 26 ఏళ్లు కాగా, ఆశుతోశ్ రాంకా వయసు 31 ఏళ్లు. వారి వయసుల నేపథ్యంలో మీరు జెన్-జెడ్ తరానికి చెందినవారు కాదని వ్యాఖ్యానించిన న్యాయమూర్తి మిలీనియల్స్ ఏ వయో వర్గానికి చెందుతారని సరదాగా ప్రశ్నించారు. విద్యార్థుల ఉద్యమంగా మొదలైన నిరసన క్రమంగా వేరే స్వరూపం సంతరించుకుందనే విషయాన్ని కూడా కోర్టు ప్రస్తావించింది. నిరసనలో పాల్గొనే వ్యక్తులు మారకపోయినా, వారి ఆందోళనకు సంబంధించిన కారణాలు మారే అవకాశం ఉంటుందని అభిప్రాయపడింది. శాంతిభద్రతలకు భంగం కలిగే ప్రమాదం ఉందనే అనుమానం ఏర్పడినప్పుడు నిర్వాహకుల నేపథ్యం, సంస్థ లక్ష్యాలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని వివరించింది.

## అంగరంగా వైభవంగా 'జంబూ సవారీ'

## మైసూరులో ఘనంగా దసరా సంబరాలు

కర్ణాటకలోని మైసూరు నగరం విజయదశమి వేడుకలతో సందడిగా మారింది. 11 రోజుల పాటు వైభవంగా నిర్వహించిన మైసూరు దసరా ఉత్సవాల ముగింపు ఘట్టంలో భాగంగా బుధవారం విజయదశమి ఊరేగింపు ప్రారంభమైంది. రాష్ట్ర పండుగగా జరుపుకునే ఈ ఉత్సవాలు కర్ణాటక సంస్కృతి, సంప్రదాయాలు, పూర్వపు రాజవైభవాన్ని ప్రతిబింబించాయి. సాయంత్రం జరిగే ప్రసిద్ధ 'జంబూ సవారీ'ని వీక్షించేందుకు వేలాది మంది ప్రజలు తరలివచ్చారు. 'ప్రశాంత' అనే ఏనుగు నేతృత్వంలో అలంకరించిన 12 ఏనుగులు ఈ ఊరేగింపులో పాల్గొనున్నాయి. 750 కిలోల బరువున్న బంగారు పూత పూసిన అంబారీలో చాముండేశ్వరి దేవి విగ్రహాన్ని ఉంచి ఊరేగించడం ఈ వేడుకల్లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. మైసూరు దసరా వేడుకలను వీక్షించేందుకు వివిధ దేశాలకు చెందిన దౌత్యవేత్తలు, విదేశీ ప్రముఖులు హాజరయ్యారు. యూరోపియన్ యూనియన్ రాయబారి జీన్-ఎరిక్ పాక్వెట్, చైనా రాయబారి జు ఫీహాంగ్, భారతదేశంలో ఈక్వెడార్ రాయబారి ఫెర్నాండో బుచెలి, మొజాంబిక్ హైకమిషనర్ అర్మాండో పెడ్రో, బల్గేరియా రాయబారి నికోలే యాంకోవ్, బ్రిటన్ డిప్యూటీ హైకమిషనర్ హర్ష్‌బీర్ సంఘా ఈ కార్యక్రమానికి వచ్చిన వారిలో ఉన్నారు. కర్ణాటక ఉన్నత విద్యాశాఖ మంత్రి బసవరాజ్ రాయరెడ్డి వారికి స్వాగతం పలికారు. డానిష్ కాన్సుల్ జనరల్ పీటర్ వింతర్, ఇజ్రాయెల్ కాన్సుల్ జనరల్ ఓర్లీ వీట్జ్‌మాన్, ఆస్ట్రేలియన్ కాన్సుల్ జనరల్, అర్మేనియా రాయబార కార్యాలయ కౌన్సిలర్ మారత్ మెలికియన్ కూడా వేడుకల్లో పాల్గొన్నారు. కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ ఆహ్వానం మేరకు తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, కేరళకు చెందిన ప్రముఖ నాయకుడు వి.డి. సతీశన్ కూడా ఈ ఏడాది వేడుకలకు హాజరవుతున్నట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. దేశ, విదేశాల ప్రముఖుల రాకతో మైసూరు దసరా ఉత్సవాలకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది.

### రాజవంశ సంప్రదాయాలకు ప్రత్యేక పూజలు

మైసూరు రాజప్రాసాదంలో విజయదశమి సందర్భంగా సంప్రదాయ కార్యక్రమాలు నిర్వహించారు. పూర్వపు మైసూరు రాజవంశ వారసుడు యదువీర్ కృష్ణదత్త చామరాజ వడియార్ అంబ విలాస్ ప్యాలెస్ నుంచి అదే ప్రాంగణంలోని భువనేశ్వరి దేవి ఆలయం వరకు 'విజయ యాత్ర' చేపట్టారు. అక్కడ శమీ వృక్షానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 1.36 గంటల నుంచి 1.56 గంటల మధ్య శుభప్రదమైన మకర లగ్నంలో ప్రధాన ఊరేగింపు కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అంబ విలాస్ ప్యాలెస్‌లోని బలరామ ద్వారం వద్ద డి.కె. శివకుమార్, ఇతర మంత్రులు, ప్రముఖులు 'నంది ధ్వజం'కు పూజలు చేశారు. అనంతరం విజయదశమి ఊరేగింపునకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా శివకుమార్ రాష్ట్ర ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. ఊరేగింపు ప్రారంభానికి కొన్ని గంటల ముందే ప్రజలు మార్గమధ్యంలో పెద్ద సంఖ్యలో వేచి ఉన్నారు.

## డ్రగ్స్‌తో భావితరాలకు ముప్పు

2029 డిసెంబర్ 31 నాటికి భారత్‌ను మాదకద్రవ్యాల రహిత దేశంగా మార్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. రానున్న మూడేళ్ల పాటు ఉమ్మడిగా పోరాడి మాదకద్రవ్యాల మహమ్మారిని దేశం నుంచి తరిమికొట్టాలని అమిత్ షా పిలుపునిచ్చారు. డ్రగ్స్ వల్ల భవిష్యత్ తరాలు నాశనం కావడమే కాకుండా దేశ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటోందని తెలిపారు. దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే సంస్థలకు కూడా డ్రగ్స్ అక్రమ రవాణా ద్వారా ఆర్థిక సాయం అందుతోందని పేర్కొన్నారు. ఢిల్లీలో బుధవారం నిర్వహించిన పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

"కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఒక నిర్ణయం తీసుకుంది. 2026 సంవత్సరంలో మిగిలిన భాగం, 2027, 2028, 2029 ఈ మూడున్నరేళ్లలో డ్రగ్స్ వ్యతిరేకంగా ఒక ఉమ్మడి పోరాటం చేసి, 2029 డిసెంబర్ 31 నాటికి దేశానికి డ్రగ్స్ సమస్య నుంచి విముక్తి కలిగిస్తాం. ఇది మనకు అత్యంత ముఖ్యమైన లక్ష్యం. మూడు హాట్‌స్పాట్‌లను ఎదుర్కోవడం కంటే కూడా ఇది ఎంతో ముఖ్యమైంది. ఎందుకంటే డ్రగ్స్ సమస్య మన భావి తరాలను డొల్లగా మారుస్తుంది. ఆర్థిక వ్యవస్థపై అనవసరమైన భారాన్ని మోపుతుంది. దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే సంస్థలకు ఆర్థిక సహాయం అందించడం కూడా ఈ డ్రగ్స్ దందా నుంచే జరుగుతుంది."

### డ్రగ్స్‌తో భావితరాలకు ముప్పు

మాదకద్రవ్యాల సమస్య కేవలం వ్యక్తులకు సంబంధించినది మాత్రమే కాదని, అది దేశ భవిష్యత్తుపైనా ప్రభావం చూపుతుందని అమిత్ షా అన్నారు. అందువల్ల మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టడం జాతీయ భద్రతకు కూడా కీలకమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా 'డ్రగ్స్‌పై పోరాటం' అనే థీమ్‌తో చేపట్టిన భారీ మోటార్ సైకిల్ ర్యాలీని అమిత్ షా జెండా ఊపి ప్రారంభించారు. తొమ్మిది రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన సుమారు 90 మంది పోలీసులతో కూడిన రైడర్లు ఇందులో పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహనను పెంచడమే ఈ కార్యక్రమం ఉద్దేశం. ఈ ర్యాలీలో పాల్గొనే రైడర్లు అక్టోబర్ 31న గుజరాత్‌లోని ఏక్తా నగర్‌లో నిర్వహించే ఏక్తా పరేడ్‌లో పాల్గొంటారని అధికారిక ప్రకటన తెలిపింది. జమ్మూకశ్మీర్, లద్దాఖ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, ఉత్తర్‌ప్రదేశ్, పంజాబ్, హరియాణా, చండీగఢ్, ఢిల్లీ ప్రాంతాలతో పాటు పలు కేంద్ర సాయుధ పోలీసు బలగాలు, ఇతర కేంద్ర పోలీసు సంస్థల సిబ్బంది ఈ కార్యక్రమంలో భాగమయ్యారు.

### నక్సలిజం నిర్మూలనలో పోలీసుల పాత్ర కీలకం

అలాగే దేశంలో దశాబ్దాలుగా కొనసాగిన నక్సలిజాన్ని 2026 మార్చి 31 నాటికి నిర్మూలించామని అమిత్ షా పేర్కొన్నారు. ఈ పోరాటంలో ఛత్తీస్‌గఢ్ పోలీసులు, కేంద్ర సాయుధ పోలీసు బలగాలు, కేంద్ర రిజర్వ్ పోలీసు దళం (సీఆర్‌పీఎఫ్), దాని కోబ్రా బెటాలియన్ కీలక పాత్ర పోషించాయని ప్రశంసించారు. భద్రతా బలగాల త్యాగాలు, అంకితభావం వల్లే ఈ లక్ష్యాన్ని సాధించగలిగామని అన్నారు. 1981 నుంచి 2026 మార్చి మధ్య నక్సలిజానికి సంబంధించిన హింసాకాండలో 3,600 మందికి పైగా భద్రతా సిబ్బంది, సుమారు 13,700 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారని అమిత్ షా తెలిపారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన సిబ్బందికి నివాళులర్పించారు. వారి కుటుంబాలకు దేశం ఎప్పటికీ రుణపడి ఉంటుందని పేర్కొన్నారు. ఐదు దశాబ్దాలుగా కొనసాగిన నక్సలిజం సమస్యను అధిగమించి దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగడానికి భద్రతా సిబ్బంది చేసిన త్యాగాలు పునాది వేశాయని అమిత్ షా అన్నారు. అమరుల కుటుంబాల త్యాగాలను యావత్ దేశం గుర్తిస్తుందని, వారికి ప్రగాఢ కృతజ్ఞతలు తెలుపుతోందని పేర్కొన్నారు.

### అమర పోలీసులకు ప్రధాని మోదీ నివాళులు

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసులకు ఎక్స్ మాధ్యమంలో ప్రధాని నరేంద్ర మోదీ నివాళులర్పించారు. శాంతి భద్రతలను కాపాడటం, నేరాలను అరికట్టడం, అత్యవసర పరిస్థితుల్లో స్పందించడం వంటి విషయాల్లో పోలీసుల కృషి వెలకట్టలేనిదని ప్రధాని కొనియాడారు. సవాళ్లతో కూడిన పరిస్థితుల్లో అత్యంత నిబద్ధతతో పనిచేస్తున్న పోలీసులకు కృతజ్ఞతలు చెప్పేందుకు పోలీసుల సంస్మరణ దినోత్సవం ఒక మంచి సందర్భం అని పేర్కొన్నారు. ప్రతి ఏడాది అక్టోబర్ 21న జాతీయ పోలీసు సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తారు. 1959 అక్టోబర్ 21న లద్దాఖ్‌లోని హాట్ స్ప్రింగ్స్ ప్రాంతంలో భారీగా ఆయుధాలు ధరించిన చైనా సైనికులు జరిపిన దాడిలో 10 మంది పోలీసు సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. వారి త్యాగాలను స్మరించుకుంటూ ఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

## జాతీయ భద్రతను పరిరక్షించడంలో కేంద్రం విఫలం

### మణిపుర్ హింసాకాండపై కాంగ్రెస్

మణిపుర్‌లో కొనసాగుతున్న హింసాకాండపై కాంగ్రెస్ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేసింది. వ్యూహాత్మకంగా కీలకమైన సరిహద్దు రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడటంలో, రాజ్యాంగ హక్కులను పరిరక్షించడంలో, జాతీయ భద్రతను రక్షించడంలో బీజేపీ విఫలమైందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆరోపించారు. ఇటీవల నలుగురు అమాయక పౌరులు హత్యకు గురికావడంపై ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మే 2023 నుంచి ఇప్పటివరకు 300 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, 24,530 మంది సహాయక శిబిరాల్లో దయనీయ పరిస్థితుల్లో జీవిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో శాంతిని పునరుద్ధరించేందుకు కేంద్రం తీసుకున్న చర్యలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

### మళ్లీ రక్తసిక్తమైన మణిపుర్

మణిపుర్‌లో ఇటీవల జరిగిన హింసాకాండలో నలుగురు అమాయక పౌరులు దారుణంగా హత్యకు గురికావడాన్ని ఖర్గే ఖండించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బీజేపీ అసమర్థత వల్లే రాష్ట్రం మళ్లీ రక్తసిక్తమవుతోందని 'ఎక్స్' వేదికగా విమర్శించారు. మే 2023లో లోయ ప్రాంతానికి చెందిన మైతీ వర్గానికి, కొండ ప్రాంతానికి చెందిన కుకీ వర్గానికి మధ్య ప్రారంభమైన జాతి ఘర్షణలు రాష్ట్రాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టాయని పేర్కొన్నారు. ఈ హింసాకాండలో ఇప్పటివరకు కనీసం 306 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 49 మంది ఆచూకీ తెలియకుండా పోయిందని, వేలాది మంది నిరాశ్రయులయ్యారని తెలిపారు. ఈ ఘర్షణల ప్రభావాన్ని మహిళలు, పిల్లలు, బలహీన వర్గాలకు చెందిన కుటుంబాలు ఇప్పటికీ ఎదుర్కొంటున్నాయని ఖర్గే అన్నారు. వేలాది మంది తమ ఇళ్లకు దూరంగా సహాయక శిబిరాల్లో జీవించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో శాంతిని నెలకొల్పడం, బాధితులకు భద్రత కల్పించడం, నిర్వాసితులను తిరిగి వారి నివాసాలకు చేర్చడం వంటి అంశాల్లో కేంద్రం బాధ్యత వహించాలని స్పష్టం చేశారు.

### మోదీ, అమిత్ షాకు మూడు ప్రశ్నలు

మణిపుర్ పరిస్థితులపై ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా మూడు కీలక ప్రశ్నలకు సమాధానం చెప్పాలని ఖర్గే డిమాండ్ చేశారు. జూన్ 2023లో అమిత్ షా ఏర్పాటు చేసిన శాంతి కమిటీకి ఏమైందని ప్రశ్నించారు. రాష్ట్రంలో శాంతిని పునరుద్ధరించడానికి, పౌరులను రక్షించడానికి, భద్రతాపరమైన సవాళ్లను పరిష్కరించడానికి ఇప్పటివరకు తీసుకున్న నిర్దిష్ట చర్యలేమిటని నిలదీశారు. సుప్రీంకోర్టు నియమించిన జస్టిస్ గీతా మిట్టల్ కమిటీ సిఫార్సులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో వెల్లడించాలని కోరారు. సహాయక శిబిరాల్లో 31 అసహజ మరణాలు సంభవించినట్లు సుప్రీంకోర్టు వెల్లడించినప్పటికీ, వేలాది మంది ఇంకా ఎందుకు నిరాశ్రయులుగా ఉన్నారని ఖర్గే ప్రశ్నించారు. మహిళలు, పిల్లలు, నిర్వాసిత కుటుంబాల భద్రత, గౌరవం, పునరావాసం కోసం ప్రభుత్వం ఏం చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. మూడేళ్లకు పైగా కాలం గడిచినా పరిస్థితుల్లో ఆశించిన మార్పు రాలేదని విమర్శించారు. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించడం, ముఖ్యమంత్రిని మార్చడం, తిరిగి బీజేపీ ప్రభుత్వం ఏర్పడటం వంటి రాజకీయ పరిణామాలు చోటుచేసుకున్నా శాంతి నెలకొనలేదని ఖర్గే అన్నారు. హింస ప్రారంభమైన తర్వాత దాదాపు 29 నెలల పాటు మణిపుర్‌లో అడుగుపెట్టని ప్రధాని మోదీ, పార్లమెంటులో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడంలో విఫలమయ్యారని ఆరోపించారు. ఇంతటి పాలనా వైఫల్యానికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. అమాయకుల ప్రాణాలు మరెన్ని కోల్పోతే కేంద్రం స్పందిస్తుందని నిలదీశారు. మణిపుర్‌కు న్యాయం, గౌరవం, రాజ్యాంగ హక్కులు, శాశ్వత శాంతి లభించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర భద్రత, స్థిరత్వాన్ని బీజేపీ తన రాజకీయ ప్రయోజనాల కోసం పణంగా పెట్టకూడదని హెచ్చరించారు. అలాగే మహిళా రిజర్వేషన్ల విషయంలో ప్రధాని మోదీ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఖర్గే ఆరోపించారు.

## సంపాదకీయం

# భయపెడుతున్న పందెం!?

కృత్రిమ మేధ మానవ మనుగడకే ముప్పు కావొచ్చని హెచ్చరిస్తున్న సంస్థలే, ఆ సాంకేతికతపై లక్షల కోట్లు కుమ్మరిస్తున్నాయి. ఇది నిజమైన భయమా? లేక పెట్టుబడులను ఆకర్షించే వ్యూహమా? అన్న చర్చ బిగుస్తోంది. విమర్శకులు దీన్ని "భయమే అమ్మకపు సరుకు" అంటుంటే, పోటీ ఉచ్చులో చిక్కుకున్న సంస్థలు ఆగలేకపోతున్నాయని మరికొందరి వాదన. ఎవరి వాదన నిజమైనా, ఇంతటి శక్తిని కొద్ది ప్రైవేట్ సంస్థల చేతుల్లోనే వదిలేయడం సరైనదేనా? అన్నది అసలు ప్రశ్న. నిజానికి -ఇది ఏఐ ప్రపంచానికి ఒక విచిత్రమైన వైరుధ్యం. ఈ ఏడాది సెప్టెంబర్‌లో యాంత్రోపిక్ సంస్థను వదిలిన పరిశోధకుడు జాకబ్ కాక్సన్, ఈ పోటీ "మన ప్రాణాలతో చెలగాట"మని బహిరంగంగా ప్రకటించారు. ఆ సంస్థలోని అలైన్‌మెంట్ సైన్స్ విభాగాధిపతి ఎవాన్ హబింగర్, దశాబ్దంలో మానవ వినాశనానికి 10 శాతానికి మించి అవకాశముందని అంచనా వేస్తున్నారు. అయితే ప్రస్తుత మోడళ్లతో ప్రమాదం తక్కువేనని, భయమంతా స్వయంగా తన సామర్థ్యాన్ని పెంచుకునే భవిష్యత్ సూపర్‌ఇంటెలిజెన్స్ గురించేనన్నది హబింగర్ మాట. ఓపెన్‌ఏఐ అధినేత సామ్ ఆల్ట్‌మన్ కూడా ఈ స్థాయి ప్రమాదం "ఆమోదయోగ్యం కాదు" అన్నారు. ఈ ఏడాది ఐపీఓకు వెళ్లబోమని ప్రకటించారు. మరోవైపు, వాస్తవ ఖర్చుల లెక్కలు వేరే కథ చెబుతున్నాయి. మైక్రోసాఫ్ట్, ఆల్ఫాబెట్, అమెజాన్, మెటా, ఒరాకిల్ అనే ఐదు పెద్ద సంస్థలు 2026లో దాదాపు 660 నుంచి 690 బిలియన్ డాలర్లు మూలధన వ్యయంగా పెడతామని ప్రకటించాయి. అది గత ఏడాదికి దాదాపు రెట్టింపు. ఇందులో మూడొంతులు ఏఐ మౌలిక సదుపాయాలకే వెళ్తోంది. ఇంత వేగం ఇంటర్నెట్ కాలంలో కానీ, క్లౌడ్ విస్తరణ కాలంలో కానీ కనిపించలేదన్నది విశ్లేషకుల మాట. కొన్ని సంస్థలు ఈ ఖర్చుకు అప్పులపై ఆధారపడటమే అసలు ప్రశ్నగా కనిపిస్తోంది. ఇది వ్యాపార వ్యూహమా, లేక తప్పించుకోలేని పరిస్థితా? ప్రపంచ విశ్లేషకుల్లో ఈ విషయంలో స్పష్టమైన రెండు శిబిరాలు కనిపిస్తున్నాయి. ఈ రెండిటి వాదనలనూ నిష్పక్షపాతంగా చూడటం సరైన పద్ధతి.

మొదటి శిబిరం ఇది వ్యూహమేనంటుంది. వారి వాదన ప్రకారం, ఒక ఉత్పత్తి మనల్ని నాశనం చేయగలదని చెప్పడం, అది ఎంత శక్తిమంతమో చాటుకోవడానికి ఉత్తమ మార్గం. గూగుల్ బ్రెయిన్ సహ స్థాపకుడు ఆండ్రూ ఎన్‌జీ చాలా కాలంగా ఇదే చెబుతున్నారు. కొన్ని సంస్థలు నిధుల సేకరణ కోసం హైప్ సృష్టించాయని, "ఏఐ అందరి ఉద్యోగాలూ తీసేస్తుంది" వంటి కథనాలు ప్రజల అవగాహనను వక్రీకరించాయని అంటారు. ఎన్విడియా అధినేత జెన్సెన్ హువాంగ్ ఇంకో కోణం చెప్పారు, కంపెనీలే ప్రభుత్వాల వద్దకు వెళ్లి మరిన్ని నియంత్రణలు కోరడం "రెగ్యులేటరీ క్యాప్చర్" అవుతుందని, ప్రమాద భయం పెట్టుబడులను అడ్డుకుంటోందని. ఈ విమర్శకుల లెక్కలో మూడు ప్రయోజనాలు కనిపిస్తాయి. మొదటిది, "ఇది యుగాన్ని మార్చే సాంకేతికత" అనే కథ బతికి ఉంటే కొత్త నిధులు, ఐపీఓ అవకాశాలు సులువవుతాయి. రెండవది, నిబంధనల రూపకల్పనలో పెద్ద సంస్థలకే పెద్ద పాత్ర దక్కితే, చిన్న పోటీదారులు ఆ గోడను దాటలేరు. మూడవది, ఏదైనా తప్పు జరిగినప్పుడు బాధ్యత ఎవరిదో నిర్ణయించే చట్రాన్ని ముందే తమకు అనుకూలంగా మలుచుకోవచ్చు. "భయం వారి అమ్మకపు సరుకే"నని వాదించే కథనాలు కూడా ఇప్పుడు వస్తున్నాయి. ఆర్థిక వైపునుంచి చూసినా ఈ అనుమానాలకు ఆధారం ఉంది. ఒక అంచనా ప్రకారం 2025లో ఏఐ సేవల ద్వారా వచ్చిన ఆదాయం పెట్టిన మౌలిక వ్యయంలో పదో వంతు మాత్రమే. మూలధన వ్యయం ఆదాయ వృద్ధి కన్నా చాలా వేగంగా పెరుగుతోందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. 1998-2001 నాటి ఫైబర్ ఆప్టిక్ బుడగను గుర్తు చేస్తున్నారు. ఇటీవలి మదుపరుల సర్వేలో కూడా, ఏఐవల్ల లాభాలు వస్తున్నాయని అంగీకరించిన వారిలో చాలామంది, పెడుతున్న డబ్బుకు తగిన ప్రతిఫలం రావడం లేదనీ అన్నారు. అంటే ప్రమాదం గురించి చేసే ప్రకటనలు, భారీ పెట్టుబడులకు సమర్థన ఇచ్చే ఒక కథనంగా కూడా పనిచేస్తున్నాయని విమర్శకుల వాదన.

రెండవ శిబిరం మాత్రం, ఇదంతా కేవలం మార్కెటింగ్ అని కొట్టిపారేయడం సరికాదంటుంది. ఈ వాదనలో అసలు సమస్య భయమూ కాదు, లాభమూ కాదు, పోటీ అనే ఉచ్చు! జాకబ్ కాక్సన్ వివరణ ఇదే. ప్రమాదాన్ని బాగా అర్థం చేసుకున్న సంస్థ కూడా, మరొకరు బాధ్యతారహితంగా ముందుకు వెళ్లి గెలుస్తారన్న భయంతో తానూ పరుగెత్తాల్సి వస్తోంది. గూగుల్ డీప్‌మైండ్ అధినేత డెమిస్ హసాబిస్ కూడా ఈ "రేస్ కండిషన్స్" ప్రమాదం గురించి హెచ్చరించారు. ఈ ఏడాది మార్చిలో యాంత్రోపిక్ తన భద్రతా నియమాల్లో కొన్నింటిని సడలించిందనే వార్తలు, పోటీ ఒత్తిడి ఎంత బలంగా ఉందో చూపాయి. భద్రతపై గట్టిగా మాట్లాడిన సంస్థలే చివరికి పోటీ ముందు తలవంచాయని మ్యాక్స్ టెగ్‌మార్క్ వంటి విమర్శకులు అన్నారు. ఒక కంపెనీ ఆగితే మరొకటి ఆ స్థానాన్ని భర్తీ చేస్తుందన్న భావన బలంగా ఉంది. దానికి దేశాల మధ్య పోటీ కూడా తోడైంది. అమెరికా ప్రభుత్వం ప్రధానంగా గెలవడంపైనే దృష్టి పెట్టిందని, అంతర్జాతీయ సమన్వయం లేనిదే ఒకరు ఆగినా లాభం లేదని విశ్లేషకులు అంటున్నారు. మరో ఆందోళనకర అంశం, కొన్ని సంస్థలు తమ మోడళ్ల పరీక్షల సమయంలో నియంత్రణ దాటి బయటి వ్యవస్థల్లోకి చొరబడిన ఘటనలను అంగీకరించడం. అంటే భయం పూర్తిగా కల్పితం కాదు. అయినా నిజం ఏమిటంటే, ఈ రెండు వాదనలూ ఒకదానికొకటి వ్యతిరేకం కావు. ఒకే సంస్థ ఒకేసారి ప్రమాదాన్ని నిజంగా నమ్మవచ్చు, ఆ భయాన్ని వ్యాపారానికి వాడుకోనూవచ్చు. కాబట్టి అసలు ప్రశ్న ఎవరు నిజాయతీపరులు అన్నది కాదు. ఇంతటి శక్తిని, ఇంత పెద్ద పందెంలో, కొద్ది ప్రైవేట్ సంస్థల నిర్ణయాలకే వదిలేయడం ఎంతవరకు సమంజసం అన్నదే. ఈ సంస్థలే నిబంధనలు రాయడం, పరీక్షలు జరపడం, లాభం పొందడం, అన్నీ చేస్తున్నాయి. ఇలాంటి విషయాల్లో స్వతంత్ర పర్యవేక్షణ, పారదర్శకమైన ప్రమాద నివేదికలు, అంతర్జాతీయ ఒప్పందాలు తప్పనిసరి. ఇందుకు స్వచ్ఛంద హామీలు చాలవు; ఆ వాగ్దానాలే చట్టాలుగా మారాలి. అప్పటివరకు భయం, పెట్టుబడి ఒకే నాణేనికి రెండు వైపులుగా నడుస్తూనే ఉంటాయి. ఆ నాణెం ఎటు పడుతుందో మనకు తెలియదు కాబట్టే, దాన్ని ఎగరేసే చేతులపై నిఘా అవసరం. ఏఐ మన భవిష్యత్తుకు దీపమవుతుందో, కాల్చే నిప్పవుతుందో నిర్ణయించేది దాన్ని నడిపే మనుషుల విజ్ఞతే. ఆ నిర్ణయం కొద్దిమంది బోర్డు రూముల్లో కాక, ప్రజాస్వామ్య చట్టాల వెలుగులో జరిగిననాడే ఈ పందెం.. మానవాళికి గెలుపవుతుంది!!

## పనికొచ్చే పలుకు



# వాళ్ల సలహాలే.. నీ జీవితమా!

రాత్రి పదకొండు. ఫోన్ చేతిలో, స్క్రోలింగ్ ఆగదు. ఒకడు "5ఏఎం క్లబ్‌లో చేరకపోతే నువ్వు లూజర్" అంటాడు. ఇంకొకడు "30 ఏళ్లలోపు కోటి సంపాదించకపోతే వేస్ట్" అంటాడు. మరొకరు నీ పోస్ట్‌కు కామెంట్ పెడతారు: "ఇంకా ఇదేనా నీ లెవెల్?" ఒక్క గంటలో నువ్వు ముగ్గురి తీర్పులు మోసి, ముగ్గురికీ సరిపోని మనిషిగా నిద్రపోతావు. ఇక్కడ ఆగి ఒక విషయం ఆలోచిద్దాం. ఈ తీర్పులన్నీ నిజంగా నీ గురించేనా?

విమర్శ అద్దం కాదు, ఫిల్టర్

ఎవరైనా నీ గురించి ఒక మాట అన్నప్పుడు, అది నీ నిజమైన ప్రతిబింబం కాదు. అది వాళ్ల కళ్లద్దాల రంగు. రోజూ ఆలస్యంగా లేచే వ్యక్తి "ఉదయం లేవడం వేస్ట్" అంటాడు, తన అపరాధ భావాన్ని కప్పిపుచ్చుకోవడానికి. ఇతరులు చేసే పనిలో తప్పులు వెతికేవాడు, సాధారణంగా తన పని చేయడానికి భయపడుతున్నవాడే. చాలా విమర్శల వెనుక ఉండేది నీ లోపం కాదు, వాళ్ల స్వీయ సందేహం, అభద్రత. నీ ఎదుగుదల వాళ్లకు తాము ఆగిపోయిన చోటును గుర్తు చేస్తుంది. అది బాధిస్తుంది కాబట్టి నిన్ను కిందకు లాగాలనుకుంటారు.

మూడు ఫిల్టర్ ప్రశ్నలు

ఏ మాట విన్నా, మనసులోకి పంపే ముందు ఇవి అడుగు.

ఈ మాట ఎక్కడి నుంచి వస్తోంది? నువ్వు వెళ్లాలనుకునే దారిలో ఇప్పటికే నడిచినవాళ్ల సలహా, బంగారం. ఆ దారి చూడనివాళ్ల తీర్పు, కేవలం శబ్దం.

ఇది ఎందుకు చెబుతున్నారు? నిజంగా నీ మంచి కోసమా, లేక తమ అభద్రతను దించుకోవడానికా, లేక వ్యూస్, లైక్స్ కోసమా? ఉద్దేశం మాటకంటే ముఖ్యం.

ఇందులో పని చేసే నిజం ఉందా? ఇదే అసలు పరీక్ష. చెప్పినవాడు నీకు నచ్చకపోయినా, మాటలో నిజం ఉంటే తీసుకో. ఎంత ఇష్టమైనవాడు చెప్పినా, నిజం లేకపోతే వదిలేయి. మనిషిని కాదు, మాటను జల్లెడ పట్టు.

లైఫ్‌స్టయిల్ మార్పు ఇక్కడే మొదలవుతుంది

చాలామంది జీవనశైలి మార్చుకోలేకపోవడానికి కారణం బద్ధకం కాదు, ఇతరుల అంచనాల బరువు. "ఇన్‌స్టాలో బాగా కనిపించాలి" అని బతికేవాడు, నిజంగా సుఖంగా ఉండే జీవితం ఎన్నడూ ట్రై చేయడు. కాబట్టి మార్పును ప్రదర్శన కోసం కాకుండా, నీ కోసం మొదలుపెట్టు.

ఈ చిన్న అలవాట్లు ప్రయత్నించు:

నిద్రకు ఫోన్ లేకుండా అరగంట. స్క్రీన్ దూరం పెడితే, తీర్పుల శబ్దం తగ్గుతుంది.

రోజుకు ఒక నడక. ఇయర్‌ఫోన్స్ లేకుండా పది నిమిషాలు. నీ ఆలోచనలు నీకే వినిపిస్తాయి.

వారానికి ఒక "మ్యూట్ డే". నీకు "సరిపోవు" అనిపించే అకౌంట్లను మ్యూట్ చేయి. అన్‌ఫాలో చేయాల్సిన పని కూడా లేదు, కొంత దూరం చాలు.

నీకు నువ్వే చెక్ ఇన్. రోజు చివర్లో ఒక్కటే అడుగు: "ఈ రోజు నేను నాకు నచ్చినట్టు బతికానా?"

ఒక గుర్తుంచుకోవాల్సిన మాట

ప్రపంచంలో అందరినీ మెప్పించిన మనిషి ఎవరూ లేరు. కానీ తమ మాటకు నిలబడి తమ జీవితాన్ని మార్చుకున్నవాళ్లు ఎందరో ఉన్నారు. విమర్శను పూర్తిగా వద్దనకు, పూర్తిగా మోయకు. జల్లెడ పట్టి, నిజాన్ని ఉంచుకుని, శబ్దాన్ని వదిలేయి. ఎందుకంటే నీ జీవితపు స్క్రిప్ట్‌కు ఎడిటర్ నువ్వే. కామెంట్ సెక్షన్ కాదు, గుర్తుంచుకో.

# పారిస్ నుంచి లిమోజ్ వరకు..!




ఫ్రాన్స్ ఇప్పుడు ఒక చేదు వాస్తవాన్ని ఎదుర్కొంటోంది. శాంతియుతంగా మొదలైన ప్రజాందోళన, చూస్తుండగానే హింస, దహనం, దోపిడీలుగా మారింది. అక్టోబర్ 17, శనివారం దేశవ్యాప్తంగా జరిగిన నిరసనల్లో ప్రభుత్వ లెక్కల ప్రకారం సుమారు 5.5 లక్షలమంది పాల్గొన్నారు. అందులో పారిస్‌లోనే 1.1 లక్షలమంది ఉన్నారు. నిర్వాహకులైన కార్మిక సంఘాలు ఈ సంఖ్య 8 లక్షల వరకూ ఉందంటున్నాయి. పగటిపూట ర్యాలీలు ప్రశాంతంగానే సాగాయి. కానీ సాయంత్రానికి నల్లటి దుస్తులు వేసుకుని, ముఖాలకు మాస్కులు ధరించిన గుంపులు రంగంలోకి దిగడంతో పరిస్థితి అదుపు తప్పింది. పారిస్, మార్సెయ్, లియాన్, లిల్లే, బోర్డో, రెన్నెస్, గ్రెనోబుల్, నీస్, లిమోజ్‌వంటి నగరాల్లో కార్లు కాలిపోయాయి, దుకాణాల అద్దాలు పగిలాయి, వందలాది వ్యాపార సంస్థలు దోపిడీకి గురయ్యాయి. అన్నింటికన్నా ఎక్కువగా దేశాన్ని కలచివేసింది లిమోజ్‌లో 143 ఏళ్ల చరిత్ర ఉన్న నగరపాలక సంస్థ భవనం దగ్ధం కావడం. మంటల్లో పైకప్పు కూలిపోయి, భవనం దాదాపు పూర్తిగా ధ్వంసమైంది. అది ఉద్దేశపూర్వకంగా పెట్టిన నిప్పేనని స్థానిక ప్రిఫెక్ట్ స్పష్టం చేశారు. లియాన్‌లో పర్యాటక సమాచార కేంద్రం మంటల్లో చిక్కుకుంది. మార్సెయ్‌లో సిటీ హాల్‌లోకి నిరసనకారులు చొరబడ్డారు. అధికారిక సమాచారం ప్రకారం కనీసం 1,800 మందిని అరెస్టు చేశారు. ఒక్క పారిస్‌లోనే రికార్డు స్థాయిలో 855 అరెస్టులు జరిగాయి, వారిలో దాదాపు మూడోవంతు మైనర్లు కావడం ఆందోళన కలిగించే విషయం. 500 మందికి పైగా పోలీసులు, జెండార్మ్‌లు, అగ్నిమాపక సిబ్బంది గాయపడినట్టు అంతర్గత వ్యవహారాల మంత్రి లారెంట్ న్యూనెజ్ తెలిపారు. పారిస్‌లో ఒక నిరసనకారుడు గుండె ఆగి మరణించగా, సెయింట్-ఎటియెన్‌లో చిన్న పేలుడు పదార్థం పేలి ఒక యువకుడు చేతిని కోల్పోయాడు. సుమారు 1,500 దుకాణాలు, వ్యాపార సంస్థలు దెబ్బతిన్నాయని రిటైల్ సమాఖ్య వెల్లడించింది. ఒక్క క్యారీఫోర్ సంస్థకే 50కి పైగా స్టోర్లకు నష్టం జరిగి, అనేక మిలియన్ యూరోలమేర నష్టం వాటిల్లిందని దాని సీఈఓ అంచనా వేశారు. మరుసటి రోజు ఉదయం దుకాణదారులు చీపుర్లతో రోడ్లపైకి వచ్చి గాజు ముక్కలు తొలగించారు. గోడలపై "ధనవంతులపై పన్నులు పెంచండి" వంటి నినాదాలు కనిపించాయి. "ఇక్కడ యుద్ధం జరిగినట్టుగా ఉంది" అని ఒక పారిస్ వాసి అన్న మాటే ఆ దృశ్యాలను ఒక్క వాక్యంలో చెబుతోంది. దోపిడీకి గురైన ఒక దుకాణ యజమాని మాటలు మరింత ఆలోచింపజేస్తాయి. తమ దుకాణాన్ని దోచుకున్నవారు పాఠశాలల గురించో, జీవన వ్యయం గురించో ఆందోళన చెందే నిరసనకారులు కాదని, ఆ గందరగోళాన్ని అవకాశంగా తీసుకున్న దొంగలన్నారు.

ఈ ఆగ్రహం ఒక్కరోజులో పుట్టింది కాదు. దీని మూలాలు పాఠశాల తరగతి గదుల్లో ఉన్నాయి. సెప్టెంబర్ 21న పారిస్ శివారులోని పేద ప్రాంతాల ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల నిరసనగా ఇది మొదలైంది. ఉపాధ్యాయుల కొరత, కిక్కిరిసిన తరగతులు, శిథిలావస్థలో ఉన్న భవనాలు విద్యార్థుల ప్రధాన ఫిర్యాదులు. పాఠశాలలకు 10 బిలియన్ యూరోలు కేటాయించాలని, విశ్వవిద్యాలయ ప్రవేశాల వ్యవస్థ అయిన "పార్కోర్సప్"ను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. అక్టోబర్ 6న దాదాపు 800 ఉన్నత పాఠశాలలు మూతపడ్డాయి. అక్టోబర్ 13న సుమారు 4.8 లక్షల మంది వీధుల్లోకి వచ్చారు. ప్రభుత్వం 3,000 మంది అదనపు ఉపాధ్యాయులను పంపుతామని ప్రకటించింది. పోలీసులు స్టన్ గ్రెనేడ్ల వాడకాన్ని నిలిపివేశారు. కానీ ప్రధాని సెబాస్టియన్ లెకోర్ను విద్యా బడ్జెట్‌ను భారీగా పెంచే డిమాండ్‌ను తోసిపుచ్చారు. 2027 బడ్జెట్‌లో విద్యకు అదనంగా 1.2 బిలియన్ యూరోలు ఇస్తున్నామని చెప్పారు. ఇక్కడే అసలు చిక్కు ఉంది. ఫ్రాన్స్ జాతీయ రుణం 1946 తర్వాత అత్యధిక స్థాయికి చేరింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పదుల బిలియన్ల యూరోల పొదుపు చర్యలతో కూడిన కఠిన బడ్జెట్‌ను సిద్ధం చేస్తోంది. అంటే ఒకవైపు ప్రజలు ఎక్కువ ఖర్చు చేయమని అడుగుతున్నారు, మరోవైపు ఖజానా ఖర్చు తగ్గించమని చెబుతోంది. దీనికి జీవన వ్యయ భారం తోడైంది. మధ్యప్రాచ్య యుద్ధం వల్ల యూరప్‌లో ద్రవ్యోల్బణం పెరిగి, ఇంధన ధరలు ఆకాశాన్ని తాకాయి. ఈ అసంతృప్తిని అందిపుచ్చుకుని, 2018-19లో ఇంధన పన్నులకు వ్యతిరేకంగా ఉద్యమించిన "ఎల్లో వెస్ట్" ఉద్యమం విద్యార్థులతో చేతులు కలిపింది. కార్మిక సంఘాలు, రైతులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు కూడా చేరారు. శనివారం జనసంఖ్య ఎల్లో వెస్ట్ ఉద్యమ గరిష్ఠ స్థాయిని దాటింది. అయితే 2023 పెన్షన్ సంస్కరణ వ్యతిరేక నిరసనల స్థాయికి మాత్రం చేరలేదు. ఆ ప్రభావం బెల్జియం, ఇటలీ, పోర్చుగల్ వంటి పొరుగు దేశాలకూ విస్తరించింది. బ్రస్సెల్స్‌లో యువత పోలీసులతో ఘర్షణ పడింది.

ఇప్పుడు అందరి కళ్లూ ప్రభుత్వ స్పందనపైనే ఉన్నాయి. అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ ఆదివారం దేశాన్ని ఉద్దేశించి మాట్లాడారు. ప్రజల "న్యాయమైన డిమాండ్లు", విధ్వంసం, దోపిడీకి పాల్పడినవారి చర్యల మధ్య స్పష్టమైన గీత గీశారు. హింసకు ఎలాంటి సమర్థనా లేదని, బాధ్యులను శిక్షిస్తామని, నష్టపోయిన వ్యాపారాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్రధాని లెకోర్ను "మేము బెదిరిపోం" అని ప్రకటించి, హింసకు "అతివాద వామపక్ష" గ్రూపులను బాధ్యులను చేశారు. నష్టపరిహారం, బీమా, నిందితులపై న్యాయ చర్యల కోసం అత్యవసర మంత్రివర్గ సమావేశం నిర్వహించారు. న్యాయ మంత్రి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రాసిక్యూటర్లను ఆదేశించారు. మరోవైపు పారిస్, మార్సెయ్, లియాన్ మేయర్లు పోలీసు బలగాల కేటాయింపుపై ప్రభుత్వాన్ని వివరణ కోరారు. ప్రతిపక్షాలు కూడా ఊరుకోలేదు. వామపక్ష నేత జీన్-లూక్ మెలెంచోన్ దోపిడీని ఖండిస్తూనే, ప్రభుత్వం పరిస్థితిని నిర్వహించిన తీరును విమర్శించారు. అధ్యక్ష ఎన్నికల్లో ముందంజలో ఉన్న మరీన్ లె పెన్ "అల్లరిమూకలు ప్రజల కొనుగోలు శక్తి కోసం చేసే ఉద్యమాన్ని విషపూరితం చేశాయి" అన్నారు. ఆరు నెలల్లో ఎన్నికలు జరగనున్న తరుణంలో ప్రతి పార్టీ ఈ సంక్షోభాన్ని రాజకీయ కోణంలోనే చూస్తోందనేది స్పష్టం.

సామాన్య ప్రజల దృష్టిలో విషయం సరళమైనది. ఆగ్రహానికి కారణమైన సమస్యలు నిజమైనవే, కానీ ఆ పేరుతో జరిగిన విధ్వంసం సమర్థనీయం కాదు. చరిత్రాత్మక భవనాలు కాలిపోయాయి, చిన్న వ్యాపారులు రోడ్డున పడ్డారు, లక్షలాది మంది శాంతియుతంగా వినిపించిన గొంతు కాలిన కార్లు, పగిలిన అద్దాల శబ్దంలో కలిసిపోయింది. హింస ఎప్పుడూ ఉద్యమం బలాన్ని తగ్గిస్తుంది, ప్రభుత్వానికి కఠిన చర్యలకు సాకు ఇస్తుంది. అదే సమయంలో ప్రజల ఆందోళనను కేవలం "శాంతిభద్రతల సమస్య"గా చూడటం కూడా పాలకులు చేసే తప్పే అవుతుంది. ఖజానా క్రమశిక్షణ ఎంత అవసరమో, బడి భవనాలు, ఉపాధ్యాయులు, ఇంధన ధరల వంటి ప్రజల రోజువారీ అవసరాలు కూడా అంతే ముఖ్యం. చర్చల బల్లపై సమాధానం వెతికే సంకల్పం ప్రభుత్వానికి, హింసను దూరం పెట్టే విజ్ఞత ఉద్యమకారులకు ఉంటేనే ఫ్రాన్స్ ఈ సంక్షోభం నుంచి బయటపడుతుంది. ఈ పరిణామం ప్రజాస్వామ్య దేశాలన్నిటికీ ఒక హెచ్చరిక కూడా! ■



మెదడు ఒక ఫోన్ లాంటిది. వంద యాప్‌లు ఒకేసారి తెరిచి ఉంటే, ఎంత ఛార్జ్ పెట్టినా అది వేడెక్కి నెమ్మదిస్తుంది. అప్పుడు మరింత నొక్కితే వేగం పెరగదు, హ్యాంగ్ అవుతుంది. కాబట్టి కొన్నిసార్లు చేయాల్సింది పరుగు కాదు, పాజ్. పనులను పక్కన పెట్టు, లోతుగా ఊపిరి పీల్చు, కాసేపు ఏమీ చేయకుండా కూర్చో. ఆ ఖాళీలోనే అలసిన మనసు రీస్టార్ట్ అవుతుంది, చెల్లాచెదురైన ఆలోచనలు ఒక్కచోట చేరతాయి. క్రమశిక్షణ ముఖ్యమే, కానీ అలసిన మనసుకు విశ్రాంతే మందు.

-మహాదేవ

## వింతల్లో వింతలు

# టెక్సాస్‌లో టోపీ... కాదు, టోపీ పేరిట బార్!




"టెక్సాస్‌లో అన్నీ పెద్దవే" అనే సామెతను అమెరికా ఈసారి అక్షరాలా నిరూపించింది. ఆస్టిన్‌లోని సర్క్యూట్ ఆఫ్ ది అమెరికాస్ రేస్ ట్రాక్‌లో, టెకోవాస్ సంస్థతో కలిసి నాలుగేళ్లు కష్టపడి ప్రపంచంలోనే అతిపెద్ద కౌబాయ్ టోపీని నిలబెట్టారు. ఫైబర్‌గ్లాస్, ఫోమ్, ఉక్కు చట్రంతో చేసిన ఈ టోపీ 43 అడుగుల వెడల్పు, 47 అడుగుల పొడవు, 17 అడుగుల ఎత్తు! గిన్నిస్ రికార్డు కూడా దక్కింది. అసలు మజా ఏమిటంటే, టోపీ కింద పూర్తిస్థాయి బార్ ఉంది. అంటే రేసు చూడటానికి వెళ్లినవాళ్లు ఎండకు తలదాచుకుంటారు, బయటకు వచ్చేసరికి తల తిరుగుతుంది!

# జింబాబ్వేపై భారత్ ఘన విజయం

## 3-0తో సిరీస్ క్లీన్ స్వీప్!



రాయ్‌పూర్ వేదికగా జింబాబ్వే మహిళలతో జరిగిన మూడో టీ20 మ్యాచ్‌లో భారత మహిళల జట్టు 92 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను భారత్ 3-0తో క్లీన్ స్వీప్ చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 216 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం 217 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన జింబాబ్వే జట్టు 20 ఓవర్లలో 7 వికెట్లకు 124 పరుగులకే పరిమితమైంది. భారత భారీ స్కోరు చేయడంలో సీనియర్ ప్లేయర్ హర్మన్‌ప్రీత్ కౌర్, విధ్వంసకర ఓపెనర్ షఫాలీ వర్మ కీలక పాత్ర పోషించారు. నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన హర్మన్‌ప్రీత్ కౌర్ జింబాబ్వే బౌలర్లపై విరుచుకుపడుతూ కేవలం 41 బంతుల్లోనే 10 ఫోర్లు, 5 సిక్సర్లతో అజేయంగా 91 పరుగులు సాధించింది. మరోవైపు షఫాలీ వర్మ 37 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్సర్లతో 69 పరుగులు చేసి రాణించింది.

### స్మృతి మంధాన రికార్డు బద్దలు కొట్టిన హర్మన్‌ప్రీత్:

ఈ మ్యాచ్‌లో అజేయంగా 91 పరుగులు చేసిన హర్మన్‌ప్రీత్ కౌర్ సరికొత్త రికార్డు సృష్టించింది. భారత గడ్డపై మహిళల టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో భారత బ్యాటర్ చేసిన అత్యధిక వ్యక్తిగత స్కోరు రికార్డును తన ఖాతాలో వేసుకుంది. ఇంతకుముందు ఈ రికార్డు స్మృతి మంధాన పేరిట ఉండేది. 2025 డిసెంబర్ 28న తిరువనంతపురంలో శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో మంధాన 48 బంతుల్లో 80 పరుగులు చేయగా, తాజాగా ఆ రికార్డును హర్మన్‌ప్రీత్ అధిగమించింది.

### బౌలింగ్‌లో రాణించిన నందని శర్మ:

భారీ లక్ష్య ఛేదనలో బరిలోకి దిగిన జింబాబ్వేకు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. కెలిస్ న్ధ్లోవు ఖాతా తెరవకుండానే తొలి బంతికే ఔటైంది. షార్నే మేయర్స్ (60) పోరాడినప్పటికీ, భారత బౌలర్ల విజృంభణ ముందు నిలవలేకపోయారు. భారత బౌలర్లలో నందని శర్మ 4 ఓవర్లలో కేవలం 18 పరుగులు మాత్రమే ఇచ్చి 3 కీలక వికెట్లు పడగొట్టింది. దీప్తి శర్మ, క్రాంతి గౌడ్, అరుంధతి రెడ్డి చెరో వికెట్ తీశారు. జింబాబ్వే తరఫున కెలిస్ న్ధ్లోవు టీ20ల్లో అత్యధిక డకౌట్ల (9) రికార్డు నమోదు చేయగా, షార్నే మేయర్స్ ఒక ఇన్నింగ్స్‌లో నాలుగు సిక్సర్లు బాది రికార్డు సృష్టించింది. ఈ సిరీస్ విజయంతో భారత జట్టు నూతన జోరును ప్రదర్శించింది.

# ఒకే మూడ్.. ఒకే టెంప్లేట్.. బన్నీ సినిమాకు మొదట్లోనే ట్విస్ట్!







టాలీవుడ్ లో ఇప్పుడు కొత్త సమస్య మొదలైంది. ఏ పెద్ద సినిమా చూసినా ఒకే తరహా టెంప్లేట్, ఒకే మూడ్ కనిపిస్తోంది. హీరోలందరూ తెరపై సరికొత్తగా కనిపించాలని తాపత్రయపడుతున్నప్పటికీ.. చివరికి అందరూ ఒకే రకమైన డార్క్, రస్టిక్ ప్రపంచాల్లోకే అడుగుపెడుతున్నారు. బాక్సాఫీస్ దగ్గర ఏదో ఒక సినిమా క్లిక్ అవ్వగానే, మిగిలిన డైరెక్టర్లంతా తమ హీరోలను కూడా అదే మూస ధోరణిలోకి నెట్టేస్తున్నారనే చర్చ ఇప్పుడు ఫిల్మ్ సర్కిల్స్ లో జోరుగా సాగుతోంది.

శ్రీకాంత్ ఓదెల డైరెక్షన్ లో నాని చేసిన 'ది ప్యారడైజ్', బుచ్చిబాబు దర్శకత్వంలో రామ్ చరణ్ నటించిన 'పెద్ది' ప్రాజెక్టుల విషయంలో ఈ పోలికలు ఎక్కువగా వినిపించాయి. ఈ రెండు భారీ చిత్రాలు రా అండ్ రస్టిక్ నేపథ్యంలో సాగే ఇంటెన్స్ డ్రామాలే. అయితే స్క్రీన్ పై కనిపించే డార్క్ విజువల్స్ నుంచి హీరో ఎలివేషన్లు, హెవీ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ వరకు రెండింటి మధ్య ఉన్న డిఫరెన్స్ చూసి.. ఇవి రెండూ ఒకే ఫార్మాట్ లో అటు ఇటు తిప్పి తీసినట్లు ఉన్నాయనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.స్టార్టింగులో ఇలాంటి రస్టిక్ అవతారాలు, రక్తపాతం ఆడియన్స్ కు కాస్త థ్రిల్ ఇచ్చాయి. కానీ వరుసగా ప్రతి స్టార్ హీరో అదే మట్టి గెటప్, అదే గ్యాంగ్ స్టర్ నేపథ్యంతో వస్తుంటే థియేటర్లలో ఫ్రెష్ నెస్ పూర్తిగా దెబ్బతింటోంది. సినిమా టైటిల్ మారినా చూసే విజువల్స్ లో తేడా లేకపోవడంతో ఆడియన్స్ లో క్రమంగా విసుగు మొదలవుతోంది. క్రియేటివిటీ అంటే స్క్రీన్ మొత్తం నలుపు, ఎరుపు రంగులతో నింపేయడం కాదనే విమర్శలు ఇండస్ట్రీ వర్గాల నుంచే వస్తున్నాయి.ఈ రొటీన్ ఫార్ములా సెగ ఇప్పుడు అల్లు అర్జున్ లోకేష్ కనగరాజ్ ప్రాజెక్ట్ ఏఏ23 కు కూడా తగిలింది. ఈ క్రేజీ కాంబినేషన్ సెట్ అవ్వగానే బన్నీ లుక్ కోసం ముంబైలో ప్రత్యేకంగా ఒక లుక్ టెస్ట్ వీడియోను షూట్ చేశారట. ఆ వీడియోతోనే సినిమాకు సంబంధించిన ఫస్ట్ ఇంపాక్ట్ ఇవ్వాలని మేకర్స్ ప్లాన్ చేశారు. అయితే సరిగ్గా అదే టైమ్ లో మరో స్టార్ హీరో గ్యాంగ్ స్టర్ మూవీ నుంచి అచ్చం అలాంటి డార్క్ టోన్ తో ఉన్న ప్రమోషనల్ వీడియో బయటకు వచ్చింది.వేరే సినిమా వీడియోతో తమ కాన్సెప్ట్ సింక్ అవుతుండటాన్ని గమనించిన ఏఏ23 టీమ్ వెంటనే అప్రమత్తమైంది. ఇప్పుడు తాము ఆ వీడియోను రిలీజ్ చేస్తే వేరే సినిమాను కాపీ కొట్టినట్లు ఉంటుందనే ఉద్దేశంతో, తమ పాత ప్రమోషనల్ ప్లాన్ ను ప్రస్తుతానికి పక్కన పెట్టినట్లు తెలుస్తోంది. తమ లుక్ టెస్ట్ ను మళ్లీ కొత్తగా ఎలా డిజైన్ చేయాలనే దానిపై లోకేష్ టీమ్ పునరాలోచనలో పడింది. ఒకే ట్రెండ్ ను అందరూ ఫాలో అవ్వడం వల్ల మొదట్లోనే ఇలాంటి సమస్యలు ఎదురవుతున్నాయి.తెలుగు సినిమాకు అసలైన బలం వైవిధ్యమైన కథలను, లోతైన ఎమోషన్లను చూపించడమే. ఒక హీరోకు లేదా ఒక దర్శకుడికి వర్కౌట్ అయిన స్టైల్ ఇండస్ట్రీలో అందరికీ సెట్ అవుతుందనే గ్యారెంటీ ఉండదు. ప్రతి ప్రాజెక్ట్ కు ఒక విలక్షణమైన ఐడెంటిటీ ఉన్నప్పుడే ప్రేక్షకులు ఆసక్తి చూపిస్తారు. పాత సక్సెస్ ఫార్ములాలను జిరాక్స్ తీయడం మానేసి, రూట్ మార్చి కొత్త ఐడియాలతో వస్తేనే దర్శకులకు బాక్సాఫీస్ దగ్గర లాంగ్ రన్ ఉంటుంది.

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com